జర్నలిస్ట్ డైరీ

తెలుగు దినపత్రిక

సంపుటి :13 సంచిక :79 ఆదివారం | 22-11-2026 పేజీలు:8 వెల:రు 3

https://www.epaperjournalistdiary.com/





కాంగ్రెస్ పాలనలో గ్రామీణాభివృద్ధి

కుదేలు

- కేసీఆర్ హయాంలో పంచాయతీల సగటు వ్యయం రూ.16.59 లక్షలు
- రేవంత్ ప్రభుత్వంలో రూ.6.24 లక్షలకు తగ్గుదల
- ఆర్బీఐ నివేదిక గణాంకాలే ఆధారమన్న కేటీఆర్
- గ్రామాల్లో అభివృద్ధి పనులు నిలిచిపోయాయని విమర్శ
- ప్రజల పన్నులు, ప్రభుత్వ అప్పుల నిధులు ఏమవుతున్నాయని ప్రశ్న
- నిధులు ఇతర అవసరాలకు మళ్లిస్తున్నారని ఆరోపణ
- గ్రామీణ మౌలిక సదుపాయాలపై ప్రభుత్వ నిర్లక్ష్యమని ధ్వజం
- రాష్ట్రంలో అభివృద్ధి కాదు.. విధ్వంసం జరుగుతోందని వ్యాఖ్య

హైదరాబాద్,

కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో గ్రామీణాభివృద్ధి కుంటుపడిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. గ్రామ పంచాయతీలకు కేటాయించే నిధులు, అభివృద్ధి పనుల కోసం చేసే వ్యయం గణనీయంగా తగ్గిపోయాయని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో గ్రామాలు అభివృద్ధి బాటలో పయనించగా, ప్రస్తుత ప్రభుత్వంలో నిధుల కొరతతో పనులు నిలిచిపోయాయని పేర్కొన్నారు. ఈ విషయాన్ని తాము చెబుతున్నది కాదని, ఆర్బీఐ విడుదల చేసిన 'ఫైనాన్సెస్ ఆఫ్ పంచాయతీరాజ్ ఇన్‌స్టిట్యూషన్స్' నివేదికలోని గణాంకాలే స్పష్టం చేస్తున్నాయని శనివారం సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా వెల్లడించారు.

-మిగతా 2 లో

ఫ్యూచర్ సిటీపై రేవంత్ నజర్!

నిధుల కొరత రాకుండా ముందస్తు కార్యాచరణ



- వచ్చే ఉగాది నాటికి మాస్టర్‌ప్లాన్ ఆవిష్కరణకు సన్నాహాలు
- సింగపూర్ సంస్థకు రూపకల్పన బాధ్యతలు
- 30 వేల ఎకరాల్లో 11 ప్రత్యేక రంగాలకు స్థలాల కేటాయింపు
- మౌలిక సదుపాయాల కోసం రూ.18 వేల కోట్ల అంచనా
- రహదారుల అభివృద్ధికి రూ.5 వేల కోట్లు
- నీరు, వ్యర్థాల నిర్వహణకు రూ.6 వేల కోట్లు
- విద్యుత్ వసతుల కోసం రూ.2,350 కోట్లు

హైదరాబాద్,

ప్రతిష్టాత్మక భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణాన్ని వేగవంతం చేయడంతోపాటు, నిధుల కొరత తలెత్తకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముందస్తు కార్యాచరణ చేపట్టారు. ఎన్నికల్లోగా ఫ్యూచర్ సిటీని పాక్షికంగానైనా ప్రారంభించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగా మాస్టర్‌ప్లాన్ రూపకల్పన, మౌలిక సదుపాయాల కల్పన, నిధుల సమీకరణపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. వచ్చే ఏడాది ఉగాది నాటికి ముఖ్యమంత్రి చేతుల మీదుగా మాస్టర్‌ప్లాన్‌ను ఆవిష్కరించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. హైదరాబాద్‌కు సమీపంలోని మీర్‌ఖాన్‌పేట్--ముచ్చర్ల గ్రామాల మధ్య సుమారు 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేయనున్నారు. సుమారు 820 చదరపు కిలోమీటర్ల పరిధిలోని గ్రామాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని సమగ్ర ప్రణాళిక రూపొందిస్తున్నారు. భవిష్యత్తులో పెరిగే జనాభా, నివాస ప్రాంతాలు, పారిశ్రామిక అవసరాలు, రవాణా సౌకర్యాలకు అనుగుణంగా భూముల వినియోగాన్ని

-మిగతా 2 లో



సవాళ్లు ఎదుర్కోకుండా

నేను బతకలేను

- ఐఐటీ ఖరగ్‌పూర్‌లో పీఎం మోదీ కీలక వ్యాఖ్యలు!
- సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొని నిలబడటాన్ని నేర్చుకోవాలని హితవు
- దేశ ప్రగతిని అడ్డుకునే అతిపెద్ద అవరోధం మనసులోని పరిమితులేనని వ్యాఖ్య
- కొన్నేళ్లుగా భారత్ ఆ అడ్డంకులను అధిగమించి ముందుకు సాగిందని స్పష్టీకరణ
- 50 కోట్ల మంది పేదరికం నుంచి విముక్తి పొందారని వెల్లడి
- ఖరగ్‌పూర్ ప్లాటినం జూబ్లీ వేడుకల్లో మాట్లాడిన నరేంద్ర మోదీ



పాకిస్థాన్-ఏతో భారత్-ఏ అమీతుమీ

- ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ టోర్నీలో దాయాదుల సమరం
- నేడు దోహాలో చిరకాల ప్రత్యర్థుల ముఖాముఖి
- గెలుపుతో సెమీఫైనల్ బెర్తుపై భారత్-ఏ గురి
- గత ఎడిషన్ ఓటమికి బదులు తీర్చుకోవాలని పట్టుదల
- తొలి మ్యాచ్‌లో నేపాల్‌పై 306 పరుగుల భారీ విజయం
- అదే జోరు కొనసాగించి అగ్రస్థానంపై తిలక్ వర్మ సేన కన్ను
- యూఏఈపై గెలుపుతో ఆత్మవిశ్వాసంతో పాకిస్థాన్-ఏ

'ఆపరేషన్ సిందూర్' వేళ పాక్‌కు చైనా రహస్య సాయం..

- అమెరికా నివేదికలో బండారం బట్టబయలు!
- భారత్ ఎదుగుదలను అడ్డుకునేందుకే పాక్‌కు చైనా సాయం చేసిందన్న యూఎస్ ప్యానెల్
- ఆపరేషన్ సిందూర్ సమయంలో పాక్ యుద్ధ విమానాలకు చైనా సాంకేతిక మద్దతు
- భారత సరిహద్దు మోహరింపుల సమాచారాన్ని పాక్‌కు చేరవేసిన వైనం
- రెండు వైపుల నుంచి ఒకేసారి ముప్పు పొంచి ఉందని కమిషన్ హెచ్చరిక

02



వచ్చే ఎన్నికల్లోనూ గోల్ కొడతాం!

విజయంపై పూర్తి ధీమాతో ఉన్నాం



- ప్రజల్లోకి ఎలా వెళ్లాలో మాకు బాగా తెలుసు
- ఎన్నికల ఆటను పక్కాగా ఆడుతున్నాం
- వ్యూహాలకు పదును పెడుతూ ముందుకు సాగుతున్నాం
- వైఎస్సార్ హయాంలో మాదిరిగా అంకితభావంతో పనిచేసే నాయకులు
- కష్టపడే కార్యకర్తలే పార్టీకి అసలైన బలం
- బీజేపీ ఎన్ని వ్యూహాలు పన్నినా ఎదుర్కొనేందుకు సిద్ధం
- వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లోనూ విజయం మాదేనన్న పొంగులేటి

02

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లోనూ విజయం సాధించి మరోసారి గోల్ కొడతామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శనివారం హైదరాబాద్‌లో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. ఎన్నికలను ఎదుర్కోవడం, ప్రజల్లోకి వెళ్లి వారి మద్దతు పొందడం తమకు కొత్తేమీ కాదని, ఎన్నికల ఆటను పక్కా వ్యూహాలతో ఆడుతున్నామని చెప్పారు. దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో మాదిరిగానే అంకితభావంతో పనిచేసే నాయకులు, పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలు తమకు అసలైన బలమని పేర్కొన్నారు. ప్రజలతో మమేకమవుతూ, రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా వ్యూహాలకు పదును పెడుతున్నామని తెలిపారు. బీజేపీ ఎన్ని రాజకీయ ఎత్తుగడలు వేసినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని, పార్టీ నాయకులు, కార్యకర్తల సమష్టి కృషితో వచ్చే ఎన్నికల్లోనూ గెలుపు సాధిస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు.



కశ్మీర్‌లో స్థానిక ఉగ్రవాదులు లేరు!

- 35 ఏళ్ల తర్వాత తొలిసారిగా స్థానిక ఉగ్రవాదుల ఉనికి పూర్తిగా అంతం
- ఎల్ఈటీకి చెందిన చివరి స్థానిక కమాండర్ హతం
- లోయలో మిగిలింది విదేశీ ఉగ్రవాదులే
- దేశ భద్రతలో కీలక మైలురాయిగా అభివర్ణించిన అమిత్ షా
- త్వరలో ఉగ్రవాద రహిత ప్రాంతంగా జమ్ముకశ్మీర్
- అరుణాచల్‌ప్రదేశ్‌లో 900 మందికి పైగా పోలీసులకు నియామక పత్రాలు
- సరిహద్దు రాష్ట్ర భద్రతకు అత్యంత ప్రాధాన్యమున్న కేంద్ర హోంమంత్రి
- స్థానికుడైన లతీఫ్ తక్కువ కాలంలోనే కమాండర్‌గా ఎదుగుదల

శాంతిభద్రతల సాకుతో

జర్నలిస్టులను అడ్డుకోరాదు



02



ఎస్సై అభ్యర్థులకు అలర్ట్.. హాల్‌టికెట్లు విడుదల

ఈ నెల 29న ప్రిలిమినరీ రాత పరీక్ష

- నేటి నుంచి 28వ తేదీ వరకు హాల్‌టికెట్ల డౌన్‌లోడ్
- అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులోకి
- హాల్‌టికెట్‌పై పాస్‌పోర్టు సైజు ఫొటో తప్పనిసరి
- దరఖాస్తులో ఉపయోగించిన ఫొటోనే అతికించాలి
- ఫొటో లేకుంటే పరీక్షకు అనుమతి నిరాకరణ
- సాంకేతిక సమస్యలపై ప్రత్యేక సహాయ నంబరు
- టీఎస్ఎల్పీఆర్బీ చైర్మన్ వి.వి. శ్రీనివాసరావు ప్రకటన

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి

తెలంగాణలో ఎస్సై ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో కీలక ముందడుగు పడింది. ఈ నెల 29న నిర్వహించనున్న ఎస్సై ప్రిలిమినరీ రాత పరీక్షకు సంబంధించిన హాల్‌టికెట్లను ఈ నెల 22వ తేదీ నుంచి అందుబాటులో ఉంచుతున్నట్లు తెలంగాణ రాష్ట్రస్థాయి పోలీస్ నియామక మండలి (టీఎస్ఎల్పీఆర్బీ) చైర్మన్ వి.వి. శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు..అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 28వ తేదీ వరకు తమ హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఆయన సూచించారు. ఈ ప్రక్రియలో ఏవైనా సాంకేతిక సమస్యలు ఎదురైతే ఆకు ఈ-మెయిల్ చేయడం ద్వారా లేదా

-మిగతా 2 లో

కాంగ్రెస్ పాలనలో గ్రామీణాభివృద్ధి కుదేలు

(మొదటి తరువాయి)

సగటు వ్యయం భారీగా తగ్గుదల

2022-23 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలు సగటున రూ.16.59 లక్షలు ఖర్చు చేశాయని కేటీఆర్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2024-25లో ఈ వ్యయం రూ.6.24 లక్షలకు పడిపోయిందని పేర్కొన్నారు. పంచాయతీల సగటు వ్యయం ఇంతలా తగ్గడం గ్రామీణాభివృద్ధిపై ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు.

నిధులన్నీ ఎటు పోతున్నాయి?

ప్రజలు చెల్లిస్తున్న పన్నులు, ప్రభుత్వం తీసుకొస్తున్న లక్షల కోట్ల రూపాయల అప్పులు ఎటు వెళ్తున్నాయని కేటీఆర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ అధిష్ఠానం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు నిధులను దోచుకుంటున్నారని ఆరోపించారు. ఖజానాలోని సొమ్మును అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఖర్చు చేయకుండా ఇతర అవసరాలకు మళ్లిస్తున్నారని విమర్శించారు.

గతంలో గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యం

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో గ్రామ పంచాయతీలకు అవసరమైన నిధులు సమకూర్చి, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యమిచ్చామని కేటీఆర్ పేర్కొన్నారు. రహదారులు, ఇతర అభివృద్ధి పనుల ద్వారా గ్రామాల రూపురేఖలు మార్చేందుకు చర్యలు తీసుకున్నామని గుర్తుచేశారు. ప్రస్తుత ప్రభుత్వంలో మాత్రం గ్రామాల్లో అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదని ఆరోపించారు.

అభివృద్ధి కాదు.. విధ్వంసం

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి నిధులు అందకపోవడంతో పంచాయతీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని కేటీఆర్ అన్నారు. ప్రభుత్వం గ్రామాల అవసరాలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో జరుగుతున్నదంతా అభివృద్ధి కాదని, విధ్వంసమేనని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

సవాళ్లు ఎదుర్కోకుండా నేను బతకలేను..

-ఐఐటీ ఖరగ్‌పూర్‌లో పీఎం మోదీ కీలక వ్యాఖ్యలు!
-సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొని నిలబడటాన్ని నేర్చుకోవాలని హితవు
-దేశ ప్రగతిని అడ్డుకునే అతిపెద్ద అవరోధం మనసులోని పరిమితులేనని వ్యాఖ్య
-కొన్నేళ్లుగా భారత్ ఆ అడ్డంకులను అధిగమించి ముందుకు సాగిందని స్పష్టీకరణ
-50 కోట్ల మంది పేదరికం నుంచి విముక్తి పొందారని వెల్లడి
-ఖరగ్‌పూర్ ప్లాటినం జూబ్లీ వేడుకల్లో మాట్లాడిన నరేంద్ర మోదీ



సవాళ్లను ఎదుర్కోకుండా తాను జీవించలేనని, సంకుచిత భావజాలాన్ని వీడినప్పుడే వ్యక్తులతో పాటు దేశం పురోగమిస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్‌లోని పశ్చిమ మిడ్నాపూర్ జిల్లా ఐఐటీ ఖరగ్‌పూర్ ప్లాటినం జూబ్లీ వేడుకల్లో శనివారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొని నిలబడటాన్ని నేర్చుకోకపోతే అనుకున్న ప్రగతిని ఎప్పటికీ సాధించలేమని యువతకు సూచించారు. దేశ ప్రగతిని అడ్డుకునే అతిపెద్ద అవరోధం మనసులోని పరిమితులేనని, గత కొన్నేళ్లుగా భారత్ ఆ అడ్డంకులను అధిగమించి ఎంతో ముందుకు సాగిందని స్పష్టం చేశారు. ఒకప్పుడు దేశంలో పేదరికాన్ని మార్చలేని శాపంగా భావించే వారని, భారత్ దాని నుంచి ఎప్పటికీ బయటపడలేదన్న అభిప్రాయం ఉండేదని ప్రధాని గుర్తుచేశారు. గతంలో ఎవరూ ఆ సమస్యను పరిష్కరించే సాహసం చేయలేదన్నారు. కానీ తాము అధికారంలోకి వచ్చాక నిరుపేదల ఆత్మగౌరవం కోసం మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రాధాన్యతనిచ్చామని చెప్పారు. ఫలితంగా దేశంలో దాదాపు 50 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తీసుకువచ్చినట్లు ప్రపంచ బ్యాంకు నివేదిక స్వయంగా ధ్రువీకరించిందని తెలిపారు. గత 75 ఏళ్ల కాలంలో భారత్ ఎడ్లబండ్ల స్థాయి నుంచి బుల్లెట్ రైళ్ల దిశగా వేగంగా ఎదిగిందని, ఈ చారిత్రక మార్పులకు ఐఐటీ ఖరగ్‌పూర్ ప్రత్యక్ష సాక్షిగా నిలిచిందని పేర్కొన్నారు. అంతరిక్ష పరిశోధన రంగంలోనూ సరికొత్త మార్పులు తెచ్చామని మోదీ వివరించారు. గతంలో ఇస్రోలోకి ప్రతిభావంతులైన యువత ప్రవేశంపై అనేక ఆంక్షలు ఉండేవని, వాటిని తొలగించి అర్హులైన యువ నిపుణులకు తలుపులు తెరిచామని వెల్లడించారు. అందుకే నేడు భారత అంతరిక్ష విజయాలను ప్రపంచం మొత్తం గుర్తిస్తోందన్నారు. సెమీకండక్టర్ల రంగంలో ఐదు దశాబ్దాల క్రితం అవకాశాన్ని చేజార్చుకున్నప్పటికీ, తాము పట్టుదలతో నాలుగేళ్లలోనే భారీ సౌకర్యాలను అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దే లక్ష్యంలో ఐఐటీ ఖరగ్‌పూర్ కీలక పాత్ర పోషించనుందని, విద్యార్థులు 'దేశమే ప్రథమం' అనే నినాదంతో సమస్యల పరిష్కారానికి నడుం బిగించాలని పిలుపునిచ్చారు.

పాకిస్థాన్-ఏతో భారత్-ఏ అమీతుమీ



దోహా:

ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ టోర్నీలో మరో ఆసక్తికర పోరుకు రంగం సిద్ధమైంది. గ్రూప్-బీలో భాగంగా ఆదివారం దోహాలోని వెస్ట్ ఎండ్ పార్క్ స్టేడియంలో భారత్-ఏ, పాకిస్థాన్-ఏ జట్లు తలపడనున్నాయి. ఈ మ్యాచ్‌లో విజయం సాధించి గత ఏడాది ఎడిషన్‌లో ఎదురైన ఓటమికి బదులు తీర్చుకోవడంతో పాటు సెమీఫైనల్ బెర్తును ఖాయం చేసుకోవాలని తిలక్ వర్మ సేన పట్టుదలగా ఉంది. తొలి మ్యాచ్‌లో నేపాల్‌పై భారత్-ఏ ఏకంగా 306 పరుగుల భారీ తేడాతో చారిత్రక విజయాన్ని అందుకుంది. అదే జోరును పాకిస్థాన్‌పై కూడా కొనసాగించి గ్రూపులో అగ్రస్థానాన్ని దక్కించుకోవాలని భావిస్తోంది. మరోవైపు అబ్దుల్ సమద్ నాయకత్వంలోని పాకిస్థాన్-ఏ జట్టు తొలి మ్యాచ్‌లో యూఏఈపై 61 పరుగుల తేడాతో గెలుపొందింది. దీంతో ఇరు జట్లు విజయమే లక్ష్యంగా బరిలోకి దిగుతుండటంతో దాయాదుల పోరు ఆసక్తికరంగా మారనుంది.

ఎస్సై అభ్యర్థులకు అలర్ట్.. హాల్‌టికెట్లు విడుదల

040-41895151 ఫోన్ నంబర్‌ను సంప్రదించి సహాయం పొందవచ్చని వివరించారు.పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు హాల్‌టికెట్‌పై తమ పాస్‌పోర్టు సైజు ఫొటోను తప్పనిసరిగా అతికించాలని చైర్మన్ స్పష్టం చేశారు. గతంలో ఆన్‌లైన్ దరఖాస్తు సమయంలో ఉపయోగించిన ఫొటోనే వాడాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఫొటో లేకుండా పరీక్ష కేంద్రానికి వచ్చే అభ్యర్థులను ఎట్టి పరిస్థితుల్లోనూ పరీక్ష రాసేందుకు అనుమతించబోమని తేల్చి చెప్పారు.

ఫ్యూచర్ సిటీపై రేవంత్ నజర్!

(మొదటి తరువాయి)

నిర్దేశించనున్నారు. ఇందుకోసం పట్టణ ప్రణాళికలో అనుభవం ఉన్న సింగపూర్ సంస్థకు మాస్టర్‌ప్లాన్ రూపకల్పన బాధ్యతలు అప్పగించారు. ఆ సంస్థ ప్రతినిధులు ఇటీవల హైదరాబాద్‌కు వచ్చి ఫ్యూచర్ సిటీ పరిధిలోని గ్రామాలపై అధ్యయనం ప్రారంభించారు. నగర పరిసరాల్లో బహుళ అంతస్తుల భవనాలు, గేటెడ్ కమ్యూనిటీలు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల ఏర్పాటుకు అనుగుణంగా భూముల వినియోగాన్ని నిర్ణయించనున్నారు. నిర్మాణ అనుమతుల కోసం బిల్ట్ నౌ విధానాన్ని అమలు చేయనున్నారు. పార్కులు, పర్యాటక ప్రాంతాలకు ప్రాధాన్యమివ్వడంతోపాటు భవిష్యత్తులో పెరిగే వాహన రద్దీకి అనుగుణంగా రహదారులను అభివృద్ధి చేయనున్నారు. కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలకు అనుమతులు ఇచ్చే సమయంలో ఎఫ్ఏఆర్ నిబంధనల ప్రకారం భవనాల మధ్య ఖాళీ స్థలాలు, రహదారులు, పార్కులకు తగిన స్థలం ఉండేలా చర్యలు తీసుకోనున్నారు. ఫ్యూచర్ సిటీ మీదుగా వెళ్లే రతన్ టాటా గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డు-1కు అనుసంధానంగా అంతర్గత రహదారులను నిర్మించాలని నిర్ణయించారు. ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, కందుకూరు, యాచారం, కడ్తాల్, మంచాల, ఆమనగల్లు మండలాల్లోని రహదారులను ఎఫ్ఎండీఏ పరిధిలోని రోడ్లతో అనుసంధానించేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు. నగర భవిష్యత్తు అవసరాలకు సరిపడా తాగునీటిని అందించేందుకు ప్రత్యేక పైప్‌లైన్ నిర్మాణంపైనా అధికారులు దృష్టి సారించారు. ఫ్యూచర్ సిటీలో మొత్తం 11 ప్రత్యేక రంగాలకు స్థలాలు కేటాయించనున్నారు. లైఫ్ సైన్సెస్, ఎలక్ట్రానిక్స్, డేటా కేంద్రాలు, కృత్రిమ మేధస్సు, ఆరోగ్య నగరం, వినోదం, మిశ్రమ వినియోగం, క్రీడా కేంద్రాలు, నివాస ప్రాంతాలు, ఫర్నిచర్ పార్కు, విద్యుత్ వాహనాలు--ఇంధన నిల్వ వ్యవస్థలు, విద్య రంగాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. పని, నివాసం, విద్య, వినోదం ఒకే ప్రాంతంలో అందుబాటులో ఉండేలా నగరాన్ని తీర్చిదిద్దాలన్నది ప్రభుత్వ లక్ష్యం. మౌలిక సదుపాయాల కల్పనకు మొత్తం రూ.18 వేల కోట్లు ఖర్చవుతాయని అంచనా వేశారు. ఇందులో రహదారుల నిర్మాణానికి రూ.5 వేల కోట్లు, నీటి సరఫరా, ఘన వ్యర్థాల నిర్వహణకు రూ.6 వేల కోట్లు, విద్యుత్ వసతులకు రూ.2,350 కోట్లు కేటాయించాలని ప్రతిపాదించారు. యెల్లంపల్లి జలాశయం నుంచి రోజుకు 164 ఎంఎల్‌డీ నీటిని సరఫరా చేయాలని యోచిస్తున్నారు. నగరం పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందితే సుమారు 15 లక్షల మంది నివసించే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. భవిష్యత్తులో నిధుల సమస్య తలెత్తకుండా ఒక్కో రంగానికి అవసరమైన వ్యయాన్ని ముందుగానే అంచనా వేసి, దశలవారీగా నిధులు సమకూర్చుకునేలా ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోంది. మాస్టర్‌ప్లాన్ ఆవిష్కరణతోపాటు కీలక మౌలిక సదుపాయాల పనులను వేగవంతం చేసి, ఎన్నికల్లోగా నగరంలోని కొన్ని భాగాలను అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకుంది.

'ఆపరేషన్ సిందూర్' వేళ పాక్‌కు చైనా రహస్య సాయం..

-అమెరికా నివేదికలో బండారం బట్టబయలు!
-భారత్ ఎదుగుదలను అడ్డుకునేందుకే పాక్‌కు చైనా సాయం చేసిందన్న యూఎస్ ప్యానెల్
-ఆపరేషన్ సిందూర్ సమయంలో పాక్ యుద్ధ విమానాలకు చైనా సాంకేతిక మద్దతు
-భారత సరిహద్దు మోహరింపుల సమాచారాన్ని పాక్‌కు చేరవేసిన వైనం
-రెండు వైపుల నుంచి ఒకేసారి ముప్పు పొంచి ఉందని కమిషన్ హెచ్చరిక



భారత్ ఎదుగుదలను అణచివేసే కుట్రలో భాగంగానే 'ఆపరేషన్ సిందూర్' సమయంలో పాకిస్థాన్‌కు చైనా సైనిక సాయం అందించిందని అమెరికా కాంగ్రెస్ కమిషన్ తన తాజా నివేదికలో కుండబద్దలు కొట్టింది. సరిహద్దుల్లో సైనిక ఒత్తిడి పెంచడం, పారిశ్రామిక సరఫరాలపై ఆంక్షలు విధించడం ద్వారా భారత్‌ను కట్టడి చేసేందుకు బీజింగ్ ప్రయత్నిస్తోందని అమెరికా-చైనా ఎకనామిక్ అండ్ సెక్యూరిటీ రివ్యూ కమిషన్ వెల్లడించింది. ఆసియాలో చైనాకు ప్రత్యామ్నాయ శక్తిగా భారత్ ఎదుగుతోందని, దీనిని అడ్డుకునేందుకే చైనా బహుముఖ వ్యూహాలను రచిస్తోందని పేర్కొంది. గత ఏడాది పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత్-పాక్ మధ్య జరిగిన నాలుగు రోజుల ఘర్షణల్లో చైనా నేరుగా యుద్ధంలోకి దిగకుండానే పాకిస్థాన్‌ను బలోపేతం చేసిందని నివేదిక స్పష్టం చేసింది. పాక్ వాయుసేన ఉపయోగించిన జే-10సీఈ యుద్ధ విమానాల పూర్తి స్థాయి వినియోగానికి తమ ఇంజనీర్లు అక్కడే ఉండి సాంకేతిక సహకారం అందించారని చైనా స్వయంగా అంగీకరించిన విషయాన్ని కమిషన్ ప్రస్తావించింది. భారత్ మోహరింపులకు సంబంధించిన సమాచారాన్ని కూడా చైనా ఎప్పటికప్పుడు పాక్‌కు చేరవేసిందని తెలిపింది. భవిష్యత్‌లో రెండు వైపుల నుంచి ఒకేసారి ముప్పు (టూ-ఫ్రంట్ వార్) ఎదురయ్యే ప్రమాదం దీనివల్ల భారత్‌కు మరింత పెరుగుతోందని హెచ్చరించింది. మరోవైపు భారత్‌పై చైనా ఆర్థిక అస్త్రాన్ని కూడా ప్రయోగిస్తోందని నివేదిక స్పష్టం చేసింది. భారత ఎలక్ట్రానిక్స్ తయారీ రంగాన్ని దెబ్బతీసేందుకు ముడిసరకుల ఎగుమతులను ఆపడం, తమ ఇంజనీర్లను వెనక్కి పిలిపించడం వంటి చర్యలకు దిగుతోందని తెలిపింది. భారత ఫార్మా, క్లీన్ ఎనర్జీ రంగాలు పుంజుకోకుండా చైనా తక్కువ ధరల వ్యూహాలను, బ్యాటరీ టెక్నాలజీ ఆంక్షలను అమలు చేస్తోందని విశ్లేషించింది. ఈ వ్యూహాలను దీటుగా ఎదుర్కొనేందుకు భారత్ తన రక్షణ రంగాన్ని ఆధునికీకరిస్తూనే దేశీయ తయారీకి పెద్దపీట వేస్తోందని, అమెరికా కూడా భారత్‌తో నిఘా, సముద్ర భద్రత, తయారీ రంగాల్లో సహకారాన్ని మరింత విస్తరించాలని ఈ కమిషన్ పిలుపునిచ్చింది.

వచ్చే ఎన్నికల్లోనూ గోల్ కొడతాం!

-ప్రజల్లోకి ఎలా వెళ్లాలో మాకు బాగా తెలుసు
-ఎన్నికల ఆటను పక్కాగా ఆడుతున్నాం
-వ్యూహాలకు పదును పెడుతూ ముందుకు సాగుతున్నాం
-వైఎస్సార్ హయాంలో మాదిరిగా అంకితభావంతో పనిచేసే నాయకులు
-కష్టపడే కార్యకర్తలే పార్టీకి అసలైన బలం
-బీజేపీ ఎన్ని వ్యూహాలు పన్నినా ఎదుర్కొనేందుకు సిద్ధం
-వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లోనూ విజయం మాదేనన్న పొంగులేటి



హైదరాబాద్, నవంబర్ 21

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లోనూ విజయం సాధించి మరోసారి గోల్ కొడతామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికలను ఎదుర్కోవడం, ప్రజల్లోకి వెళ్లి వారి మద్దతు పొందడం తమకు కొత్తేమీ కాదని పేర్కొన్నారు. ప్రజలతో ఎలా మమేకం కావాలో, ఎన్నికల సమయంలో ఎలాంటి వ్యూహాలు అనుసరించాలో తమకు పూర్తి అవగాహన ఉందని చెప్పారు. ప్రస్తుతం కూడా ఎన్నికల ప్రక్రియను దృష్టిలో పెట్టుకొని పార్టీ శ్రేణులు పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నాయని వెల్లడించారు. శనివారం హైదరాబాద్‌లో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన పలు రాజకీయ అంశాలపై మాట్లాడారు.

ఎన్నికలపై స్పష్టమైన వ్యూహం

ఎన్నికల్లో గెలుపు కోసం ప్రజల్లోకి వెళ్లడం, వారి సమస్యలను తెలుసుకోవడం, పార్టీ విధానాలను వివరించడం కీలకమని పొంగులేటి పేర్కొన్నారు. ఈ విషయంలో తమకు అనుభవం ఉందని, ఎన్నికల ఆటను పక్కాగా ఆడుతున్నామని తెలిపారు. రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా వ్యూహాలను రూపొందించుకుంటూ ముందుకు వెళ్తున్నామని చెప్పారు. ప్రజలతో సంబంధాలను బలోపేతం చేసుకోవడం, పార్టీ కార్యకర్తలను సమన్వయం చేసుకోవడం ద్వారా ఎన్నికల్లో లక్ష్యాన్ని చేరుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.

వైఎస్సార్ హయాం నాటి స్ఫూర్తి

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో పార్టీలో ఉన్న కష్టపడే తత్వం, అంకితభావం ప్రస్తుతం కూడా కొనసాగుతున్నాయని మంత్రి అన్నారు. అప్పట్లో నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేసేవారని గుర్తుచేశారు. అదే తరహాలో ప్రస్తుతం కూడా బాధ్యతతో పనిచేసే నాయకులు, నిబద్ధత కలిగిన కార్యకర్తలతో బలమైన బృందం ఉందని వివరించారు. పార్టీ కోసం శ్రమించే వారి సహకారంతో రాజకీయంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు.

బీజేపీ వ్యూహాలను ఎదుర్కొంటాం

రాష్ట్రంలో బీజేపీ అనుసరిస్తున్న రాజకీయ వ్యూహాలపైనా పొంగులేటి స్పందించారు. ఆ పార్టీ ఎన్ని రాజకీయ ఎత్తుగడలు వేసినా ఎదుర్కొనేందుకు తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. రాజకీయ ప్రత్యర్థుల వ్యూహాలకు భయపడే ప్రసక్తి లేదని, తమకు సొంత కార్యాచరణ ఉందని ఆయన వ్యాఖ్యల ద్వారా వెల్లడించారు. పార్టీ నాయకులు, కార్యకర్తల సమన్వయంతో రాజకీయంగా ఎదురయ్యే సవాళ్లను అధిగమిస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు.

కార్యకర్తలే పార్టీకి బలం

ఎన్నికల సమయంలో కార్యకర్తల పాత్ర అత్యంత కీలకమని పొంగులేటి అభిప్రాయపడ్డారు. ప్రజల్లోకి వెళ్లి పార్టీ సందేశాన్ని తీసుకెళ్లడంలో క్షేత్రస్థాయి నాయకులు, కార్యకర్తల కృషి ముఖ్యమని పేర్కొన్నారు. అంకితభావంతో పనిచేసే నాయకత్వం, బలమైన కార్యకర్తల బృందం తమకు అండగా ఉన్నాయని చెప్పారు. ఈ బలంతోనే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లోనూ గెలుపు సాధిస్తామని మంత్రి ధీమా వ్యక్తం చేశారు.

కశ్మీర్‌లో స్థానిక ఉగ్రవాదులు లేరు!

బందర్‌దేవా:

జమ్ముకశ్మీర్ చరిత్రలో కీలక పరిణామం చోటుచేసుకుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెల్లడించారు. 35 ఏళ్ల తర్వాత తొలిసారిగా కశ్మీర్ లోయలో ఒక్క స్థానిక ఉగ్రవాది కూడా మిగలలేదని స్పష్టం చేశారు. లష్కరే తొయిబాకు చెందిన చివరి క్రియాశీల స్థానిక ఉగ్రవాది మహమ్మద్ లతీఫ్ భట్ భద్రతా బలగాల ఎదురుకాల్పుల్లో హతమయ్యాడని తెలిపారు. ప్రస్తుతం లోయలో మిగిలిన ఉగ్రవాదులంతా విదేశీయులేనని పేర్కొన్నారు. ఈ పరిణామం దేశ భద్రతలో కీలక మైలురాయి అని అభివర్ణించారు.

అరుణాచల్‌ప్రదేశ్‌లోని బందర్‌దేవాలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇటీవల కుల్గాం జిల్లాలో లతీఫ్ భట్ హతమైన నేపథ్యంలో కశ్మీర్‌లో స్థానిక ఉగ్రవాదుల ఉనికి పూర్తిగా అంతమైందని ప్రకటించారు. గురువారం ఢిల్లీలో జరిగిన వార్షిక ఉగ్రవాద వ్యతిరేక సదస్సులోనూ ఇదే విషయాన్ని ప్రస్తావించారు.

900 మందికి పైగా పోలీసులకు నియామకాలు

అరుణాచల్‌ప్రదేశ్ పర్యటనలో భాగంగా కొత్తగా ఎంపికైన 900 మందికి పైగా పోలీసు సిబ్బందికి అమిత్ షా నియామక పత్రాలు అందజేశారు. వ్యూహాత్మకంగా కీలకమైన ఈ రాష్ట్రంలో భద్రత, శాంతి, అభివృద్ధి దేశానికి ఎంతో అవసరమని చెప్పారు. చైనా, భూటాన్, మయన్మార్‌లతో సరిహద్దులు పంచుకుంటున్న అరుణాచల్‌ప్రదేశ్‌కు జాతీయ భద్రతలో ప్రత్యేక ప్రాధాన్యం ఉందని వివరించారు.

స్థానికుడి నుంచి కమాండర్ స్థాయికి

కుల్గాం జిల్లా ఖ్రేవాన్ చాదర్ గ్రామానికి చెందిన మహమ్మద్ లతీఫ్ భట్ లష్కరే తొయిబాలో కమాండర్‌గా ఎదిగాడు. నవంబర్ 18న భద్రతా బలగాలతో జరిగిన ఎదురుకాల్పుల్లో హతమయ్యాడు. 2025 నవంబర్ 19న తెల్లవారుజామున ఫజర్ నమాజ్ కోసం ఇంటి నుంచి వెళ్లిన అతడిని కుటుంబ సభ్యులు చివరిసారిగా చూశారని భద్రతా సంస్థల నివేదిక పేర్కొంది. స్థానికుడిగా ఉండటం వల్ల ఉగ్రవాద కార్యకలాపాలు నిర్వహించడం అతడికి సులభమైందని, తక్కువ వ్యవధిలోనే స్థానిక కమాండర్‌గా ఎదిగాడని జమ్ముకశ్మీర్ మాజీ పోలీసు అధికారి ఎస్పీ వైద్ గతంలో పేర్కొన్నారు. పోలీసులతో పాటు పౌరులపైనా దాడులకు పాల్పడ్డాడని వివరించారు.

శాంతిభద్రతల సాకుతో జర్నలిస్టులను అడ్డుకోరాదు

సుప్రీంకోర్టులో ఎన్‌డబ్ల్యూఎంఐ వాదన



న్యూఢిల్లీ, నవంబర్ 21

జర్నలిస్టుల కార్యకలాపాల్లో జోక్యానికి శాంతిభద్రతల అధికారాలను సాకుగా చూపరాదని నెట్‌వర్క్ ఆఫ్ విమెన్ ఇన్ మీడియా, ఇండియా (ఎన్‌డబ్ల్యూఐ) సుప్రీంకోర్టుకు తెలిపింది. అక్టోబర్‌లో ఢిల్లీలో జరిగిన నిరసనలను కవర్ చేసిన మీడియా సిబ్బందిని బలవంతంగా నిర్బంధించి, దాడి చేశారని ఆరోపిస్తూ ఆ సంస్థ పిటిషన్ దాఖలు చేసింది. ఎన్నికల సంఘం పనితీరులో అవకతవకలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు జరిగిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారంలో ఢిల్లీ పోలీసులు దాఖలు చేసిన కౌంటర్ అఫిడవిట్‌కు ప్రతిస్పందనగా ఎన్‌డబ్ల్యూఎంఐ రిజాయిండర్ సమర్పించింది.జర్నలిస్టులను అడ్డుకోవడం, బలవంతంగా తొలగించడం, దాడి చేయడం లేదా లైంగిక వేధింపులకు గురిచేయడం వంటివి వారి వ్యక్తిగత స్వేచ్ఛ, శారీరక భద్రత, వృత్తి నిర్వహణ స్వేచ్ఛతోపాటు సమాచారాన్ని సేకరించి ప్రజలకు అందించే పత్రికా స్వేచ్ఛపై ఒకేసారి దెబ్బపడుతుందని పేర్కొంది. 'సాయుధ ఘర్షణలు, ఇతర ప్రమాదకర పరిస్థితుల్లోనూ జర్నలిస్టులకు వార్తా సేకరణకు సాధారణంగా అవకాశం కల్పిస్తారు. ప్రమా దం ఎదురైనప్పుడు రిపోర్టర్‌ను అక్కడి నుంచి పంపించడం కాకుండా, వారికి రక్షణ కల్పిస్తూ రిపోర్టింగ్‌కు తోడ్పడటమే గుర్తించిన విధానం' అని సంస్థ తెలిపింది.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

సిద్దాపూర్ డంపింగ్ యార్డు రద్దుపై
హామీలు కాదు అమలు కావాలి..

స్పష్టమైన అధికారిక ప్రకటన చేయాలి..

డంపింగ్ యార్డు కు కేటాయించిన భూమితో సహా మొత్తం ప్రభత్వ భూమిని పేదలకు పంచాలి..

డిసెంబర్లో ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం..

సిద్దాపూర్ డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాట జాయింట్ యాక్షన్ కమిటీ



రంగారెడ్డి జిల్లా బ్యూరో, నవంబర్ 21 (జర్నలిస్ట్ డైరీ) :

రంగారెడ్డి జిల్లా సిద్దాపూర్ గ్రామంలో ఎకో టౌన్ పేరుతో డంపింగ్ యార్డు ఏర్పాటు కు ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 641 ని రద్దు చేయాలని సిద్దాపూర్ డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాట జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో 49 రోజులుగా రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. గ్రామంలో ఈ ఉద్యమాన్ని పక్క దారి పట్టించేందుకు పరిశ్రమల పేరుతో గందరగోళం సృష్టిస్తున్నారు, ప్రజలకు వాస్తవిక పరిస్థితులను చెప్పటానికి, మంత్రి ఇచ్చిన హామీ పై, ప్రస్తుతం పరిణామాలపై దీక్షా శిబిరంలో జేఏసి నాయకులు పత్రికా సమావేశం ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర నాయకులు పాలమూరు విష్ణు వర్దన్ రెడ్డి మాట్లాడుతూ.... రేపటితో ఈ నిరాహార దీక్షలు 50 రోజులకు చేరతాయని , ఈ ఉద్యమంలో కీలకంగా ఉన్న యువతకు అభినందనలు తెలిపారు. రాష్ట్ర మంత్రి డంపింగ్ యార్డు పై ఇచ్చిన హామీని స్థానిక శాసన సభ్యులు నమ్మి విశ్వసిస్తే మా మంత్రి హామీ ఇచ్చారు మీరు రండి కలెక్టర్ దగ్గరకు తీసుకెళ్తా లేక ఇంచార్జి మంత్రి దగ్గరకు తీసుకెళ్తా మీకు ఒక హామీ ఇస్తా జివో ను ఒక 10 రోజుల్లో రద్దు చేయిస్తా అనే స్పష్టమైన హామీ ఇవ్వాలి. లేని పక్షంలో జేఏసీ ఆధ్వర్యంలో నీ ఇల్లు ముట్టడిస్తాం, నీవు కలసివస్తే మీ సీఎం ఇల్లు ముట్టడిస్తాం అని అన్నారు. ఇక్కడ ఈ సమస్య పరిష్కారం కాకముందే అభివృద్ధి పేరుతో కాలుష్య పరిశ్రమలు తీసుకొస్తే చూస్తూ ఊరుకోం అన్నారు. జేఏసీ చైర్మన్ రాంబాల్ నాయక్ మాట్లాడుతూ... ప్రజల తరుపున రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరేది ఒకటే ప్రజలకు నష్టం చేసే డంపింగ్ యార్డు ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇక్కడ ప్రభుత్వ భూములు ఉన్నాయి ఈ భూముల్లో ఇప్పుడు పొల్యూషన్ కంపెనీలు తెస్తా అంటే కుదరదు. మీకు చేయనైతే ఆ భూముల్లో కాలుష్యం లేని పరిశ్రమలను ఏర్పాటు చేయండి, లేకపోతే ఆ భూమిని పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. ఈ ఉద్యమాన్ని జీవో రద్దు చేసేవరకు కొనసాగిస్తామని, ఇకనుండి ఉధృతం చేస్తామని అన్నారు. సీపీఐ రాష్ట్ర నాయకులు పానుగంటి పర్వతాలు మాట్లాడుతూ... 49 రోజులుగా కొనసాగుతున్న ఉద్యమానికి సిపిఐ పార్టీ సంపూర్ణ మద్దతు ఉంటుందని, మంత్రి గాని స్థానికి శాసన సభ్యులు ఇచ్చిన మాట ప్రకారం ఎప్పటిలోగా డంపింగ్ యార్డు ను రద్దు చేస్తారో స్పష్టంగా చెప్పాలి. పరిశ్రమలను , అభివృద్ధిని స్వాగతిస్తాం కానీ అభివృద్ధి పేరుతో కాలుష్యం పరిశ్రమలు తీసుకొస్తే సరైనది కాదు. స్థానిక శాసన సభ్యులు వెంటనే జేఏసీ నాయకులతో చర్చించి జీవో 641 రద్దు పై స్పష్టమైన ప్రకటన చేయాలని, లేని పక్షంలో జేఏసీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తాం అని హెచ్చరించారు..జేఏసీ కన్వీనర్ పినపాక ప్రభాకర్ మాట్లాడుతూ.... రాష్ట్ర మంత్రి నందిగామలో డంపింగ్ యార్డు రాదు రానివ్వను అన్నారు, దానికి జేఏసీ తరుపున స్వాగతించడం జరిగింది. కానీ జేఏసీ గా ఎప్పటిలోగా రద్దు చేస్తారని అడిగాము. స్థానిక శాసన సభ్యులు అభివృద్ధి కార్యక్రమాల పేరుతో సిద్దాపూర్ వచ్చి కనీసం దీక్షా శిబిరాన్ని సందర్శించక పోగా అవమాన పరచే విధంగా మాట్లాడటం సరైనది కాదు. మీరు అవమాన పరిచింది ప్రజలను అనే విషయం మర్చిపోగూడదన్నారు. నిజంగా గత ప్రభుత్వంలో 120 జీవో తెచ్చారని , అందుకే డంపింగ్ యార్డు వచ్చిందనే మీరు ఆ జీవో ను రద్దు చేయొచ్చు,గత నాయకులు తప్పులు చేసి, అన్యాయంగా భూములు గుంజుకుని, అక్రమంగా ఆస్తులు సంపాదిస్తే మీరు అధికారంలోనే ఉన్నారు, దానిపై విచారణ జరిపి వారిని జైలుకు పంపండి, కానీ ఏదో మాట్లాడుతూ సమస్యను పక్కదారి పట్టిస్తూ , ప్రజల మధ్య అనవసర గందరగోళం సృష్టించే ప్రయత్నం సరైంది కాదు అన్నారు. ఇప్పుడు పరిశ్రమలు వస్తే డంపింగ్ యార్డు రాదు అనే కొత్త చర్చకు తెరలేపి కాలుష్య కారక పరిశ్రమల స్థాపనలు ఆపివేయాలి, ఆ భూములను పేదలకు పంచాలి. డంపింగ్ యార్డు రద్దు కొరకు మంత్రి ఇచ్చిన హామీ నెరవేరకపోతే డిసెంబర్ 7 తరువాత ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అప్పుడు జరిగే పరిణామాలకు స్థానిక శాసన సభ్యులే బాధ్యత వహించాలని అన్నారు..

జేఏసీ కో ఆర్డినేటర్ తిరుమలయ్య మాట్లాడుతూ... ఉద్యమం ప్రజాస్వామ్య బద్దంగా ఒక క్రమ పద్ధతిలో జరుగుతుందని, ఇంత జరుగుతున్నా ప్రభుత్వం స్పందించక పోవడం , హామీ ఇచ్చిన మంత్రి అధికారిక ప్రకటన చేయించక పోవడం ఏంటని ప్రశ్నించారు. ఉద్యమాన్ని పక్కదారి పట్టించడం కోసం ప్రజలను అవమాన పరచే విధంగా శాసన సభ్యులు మాట్లాడిన దానిని ఖండిస్తున్నాం అన్నారు. డంపింగ్ యార్డు రద్దు కాక ముందే గ్రామంలో కాలుష్య కారక పరిశ్రమల స్థాపనలు చేయాలను ప్రయత్నించటం మానుకోవాలని, భూమి ఉండబట్టే కదా ఇలాంటి నిర్ణయాలు కాబట్టి వెంటనే ఆ భూమిని పేదలకు పంచిపెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ వ్యతిరేక పోరాట జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, వడ్డే బాలయ్య, అర్జునప్ప, రవీంద్రనాథ్, బుద్దల జంగయ్య, గూని మహేష్, రాజేందర్ రెడ్డి, శ్రీదరా చారి, నాగేష్ నాయక్, బాబురాజ్, బైర్ఖంపల్లి సర్పంచ్ శివ, మాజీ సర్పంచులు రమేష్ నాయక్, యాదగిరి, మరియు నక్కల వెంకటేష్ గౌడ్, వడ్డే మల్లేష్, మహేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నర్సప్పగూడలో 700
స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

- లబ్ధిదారులకు కార్డులు అందజేసిన మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ గౌడ్



రంగారెడ్డి జిల్లా బ్యూరో, నవంబర్ 21 (జర్నలిస్ట్ డైరీ) :

నందిగామ మండల పరిధిలోని నర్సప్పగూడ గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో శనివారం నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి మంజూరైన 700 స్మార్ట్ రేషన్ కార్డులను మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ గౌడ్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా రేషన్ పంపిణీ వ్యవస్థలో మరింత పారదర్శకత, సౌలభ్యం కలుగుతాయని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.

కార్డుల పంపిణీతో గ్రామంలోని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ గౌడ్, జీపీఓ శ్రీనివాస్, బిఆర్ఎస్ మండల ఉపాధ్యక్షులు బంటారం సుదర్శన్ గౌడ్, శ్రీధర్ గౌడ్, వెంకటేష్, నారాయణ, రేషన్ డీలర్ కృష్ణ, శంకరయ్య, కట్న శ్యామణిల కావలి శివలింగం, గుండాల సురేందర్, పెంటమీద అనసూయ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పలు వార్డుల్లో ఇందిరమ్మ కుటుంబ బీమా పథకం ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్



రంగారెడ్డి జిల్లా బ్యూరో, నవంబర్ 21 (జర్నలిస్ట్ డైరీ) :

రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ బీమా పథకాన్ని మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ కుటుంబ బీమా పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. కుటుంబ పెద్దకు ఏదైనా అనుకోని ప్రమాదం జరిగినప్పుడు ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా బీమా పథకం అండగా నిలుస్తుందని పేర్కొన్నారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేస్తామని, ప్రజలకు అవసరమైన సంక్షేమ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో అందుబాటులోకి తీసుకెళ్తామని తెలిపారు, ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అందే మోహన్ ముదిరాజ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ అగ్గనూర్ విశ్వం,కౌన్సిలర్ అగ్గనూర్ విశాల, సి పెంటయ్య,సంతోషి భాయి చందు లాల్, బచ్చలి నరేష్,పిగోపాల్, గౌస్ జానీ, శివ ఎస్పీ,సర్వర్ పాషా, అగ్గనూర్ కిట్టు, అగ్గనూర్ నందు,తంగడపల్లి శంకర్, నాగమణి ,షషద్దీన్, కత్తి చంద్రశేఖర అప్ప, విష్ణువర్ధన్ రెడ్డి, నీరటి వాసు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్,మత్తు పదార్థాలకు
విద్యార్థులు దూరంగా ఉండాలి

-షాద్‌నగర్ సీఐ సీతారాం

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి..

-ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులకు పోలీసుల అవగాహన





రంగారెడ్డి జిల్లా బ్యూరో, నవంబర్ 21 (జర్నలిస్ట్ డైరీ) :

యువత భవిష్యత్తును నాశనం చేసే డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని షాద్‌నగర్ పట్టణ సీఐ సీతారాం సూచించారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని బుగ్గారెడ్డి గార్డెన్స్‌లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో డ్రగ్స్, మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఐ సీతారాంతో పాటు సైబర్ క్రైమ్, షీ టీమ్స్ ప్రతినిధులు, పలువురు పోలీసు అధికారులు హాజరై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ సీతారాం మాట్లాడుతూ కళాశాలలకు విద్యనభ్యసించేందుకు వచ్చే కొంతమంది విద్యార్థులు ఫ్యాషన్, స్నేహితుల ప్రభావంతో డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు ఇలాంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ చదువుపై దృష్టి సారించాలని సూచించారు. తమ స్నేహితుల్లో ఎవరైనా డ్రగ్స్ వినియోగిస్తున్నా, విక్రయిస్తున్నా వెంటనే ఉపాధ్యాయులు లేదా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. నేరుగా సమాచారం ఇవ్వడానికి భయపడితే 112 నంబర్‌కు ఫోన్ చేయవచ్చని, సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు. డ్రగ్స్, గంజాయి కలిగి ఉండటం, వినియోగించడం, విక్రయించడం వంటి నేరాలకు పాల్పడితే ఎన్డీపీఎస్ చట్టం ప్రకారం కఠిన చర్యలు తప్పవని, నేర తీవ్రతను బట్టి దీర్ఘకాలిక జైలు శిక్షలు పడే అవకాశం ఉందని హెచ్చరించారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈగల్ టీమ్‌తో పాటు పోలీసులు మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలపై నిరంతరం నిఘా ఉంచుతున్నారని తెలిపారు.సైబర్ నేరాల పట్ల కూడా విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సీఐ సూచించారు. ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాల్లో గుర్తుతెలియని వ్యక్తులు పంపే అనుమానాస్పద లింకులను క్లిక్ చేయవద్దని, ఆన్‌లైన్ రుణ యాప్‌ల ద్వారా వ్యక్తిగత సమాచారం, ఫొటోలు, వీడియోలు దుర్వినియోగమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. తల్లిదండ్రుల ఆరోగ్యం బాగోలేదని, అరెస్ట్ చేస్తామని, సీబీఐ విచారణ జరుగుతోందని బెదిరించే నకిలీ ఫోన్ కాల్స్‌ను నమ్మవద్దని సూచించారు. ఇలాంటి కాల్స్ వస్తే భయపడకుండా పోలీసులను సంప్రదించాలని తెలిపారు. మహిళలు, బాలికలు వేధింపులు లేదా ఇతర సమస్యలు ఎదుర్కొంటే షీ టీమ్స్ సహాయం పొందవచ్చని పేర్కొన్నారు. విద్యార్థులు చిన్నచిన్న పనుల కోసం వెళ్లి చదువును నిర్లక్ష్యం చేయకుండా విద్యాభ్యాసానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

ఇతర అధికారులు మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవితాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో విద్యార్థులు భాగస్వాములు కావాలని, మహిళలు, బాలికలు ఎలాంటి వేధింపులు ఎదుర్కొన్నా భయపడకుండా షీ టీమ్స్‌కు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సైబర్ వారియర్స్ శ్రీనివాస్, రాజు అనిల్, ఎస్ఐ ధర్మియా రాథోడ్, షాద్‌నగర్ షీ టీమ్ సభ్యులు పీసీ రేష్మ, గీత, మోటివేషనల్ స్పీకర్ మహేష్, ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి వడ్ల శ్రీకాంత్, పట్టణ ఉపాధ్యక్షులు ఆదిల్, రామ్ చరణ్, శివగౌడ్, వంశీ, తరుణ్, కార్తీక్, విష్ణువర్ధన్, చంద్రకాంత్ రెడ్డి, అబ్దుల్, సాయిగౌడ్, రాహుల్ తదితరులతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మొబైల్ అంగన్వాడీ వాహనాలను ప్రారంభించిన గాంధీ



రంగారెడ్డి జిల్లా బ్యూరో, నవంబర్ 21 (జర్నలిస్ట్ డైరీ) :

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మొబైల్ అంగన్వాడీ వాహనాలను సీఎంసీ కమిషనర్ సృజన, అదనపు కమిషనర్ సుభద్ర మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీమతి మోతీ , యూనిసెఫ్ ప్రతినిధులు ఖ్యాతి , ఫిలిప్ , ఎంఈవో వెంకటయ్య తో కలిసి జెండా ఊపి ప్రారంభించిన పిదప సీసి చైర్మన్ ఆరెక పూడి గాంధీ.ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలలో 0 నుండి 6 సంవత్సరాల వయస్సు పిల్లలకు, గర్భిణీలకు మరియు పాలిచ్చే తల్లులకు పౌష్టికాహారం అందించడమే మొబైల్ అంగన్వాడీ వాహనాల ముఖ్య ఉద్దేశ్యం అని, బస్తీ లలో తిరుగుతూ పిల్లలకు పోషక ఆహారం అందించడం జరుగుతుంది అని వీటిని సద్వినియోగం చేసుకోవాలని తెలియచేశారు. మొబైల్ అంగన్వాడీ లో చిన్నారులకు ఆటపాటలతో కూడిన ప్రాథమిక విద్యను బోధిస్తారు అని, పిల్లలు మరియు తల్లులకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారు.టీకాలు పిల్లలకు అవసరమైన వ్యాధి నిరోధక టీకాలు వేయడంలో సహకరిస్తారు. పోషకాహారం మరియు ఆరోగ్యంపై తల్లులకు అవగాహన కల్పిస్తారు అని తెలియచేశారు.పోషకాహారం, ప్రీ-స్కూల్ విద్య, ఆరోగ్య సేవలను సమగ్రంగా అందిస్తూ చిన్నారుల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. చిన్నారులకు పోషకాహారం అందించేందుకు విద్యా, ఆట వస్తువులు, ఎర్లీ చైల్డ్ కేర్ కార్యక్రమాలు అందుబాటులోకి తీసుకొచ్చామని వెల్లడించారు. నర్సరీ విద్య పూర్తి చేసిన చిన్నారులకు ప్రత్యేక సర్టిఫికెట్లు కూడా అందిస్తామన్నారు. అంగన్‌వాడీ టీచర్లకు ఇంగ్లీష్‌లో ప్రత్యేక శిక్షణ ఇచ్చామని తెలిపారు.పిల్లలను లక్షల రూపాయలు ఖర్చు చేసి ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించే బదులు అంగన్‌వాడీల్లో చేర్పించాలని సూచించారు. అత్యుత్తమ వాతావరణంలో వారిని తీర్చిదిద్దుతామని భరోసా ఇచ్చారు. పిల్లల భవిష్యత్తుకు బలమైన పునాది వేయగల సామర్థ్యం అంగన్‌వాడీ వ్యవస్థకు మాత్రమే ఉందని తెలియచేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

రంగారెడ్డి డీసీసీ అధ్యక్షురాలు పారి జాత కు సన్మానం..హర్షలత

(జర్నలిస్ట్ డైరీ) :నవంబర్ 21 ఎల్బీనగర్:

కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులుగా నియమితులైన చిగురింత పారిజాత నర్సింహారెడ్డిని శనివారం డీసీసీ ప్రధాన కార్యదర్శి తమలపాకుల హర్షలత మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పారిజాతను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు కలసి కట్టుగా పనిచేయాలని పారిజాత పిలుపునిచ్చినట్లు హర్షలత తెలిపారు.



- పారిజాత తను సత్కరిస్తున్న హర్షలత

లక్నాపూర్ పాఠశాలలో ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం





జర్నలిస్ట్ డైరీ పరిగి నవంబర్ 21

వికారాబాద్ జిల్లా లక్మాపూర్ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మరియు వివిధ పరిపాలనా హోదాల్లో బాధ్యతలు నిర్వర్తించి తమ ప్రతిభను చాటుకున్నారు.

ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఎం. అంజయ్య, గడిసింగపూర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు జాంప్ల, గ్రామ సర్పంచ్ సందీప్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివ, సూర్య, ఎంఆర్వో (MRC) సిబ్బంది శ్రీశైలం, మోహన్, యువకులు సురేష్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

దేవరకొండలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఘనంగా గోపూజ



(జర్నలిస్ట్ డైరీ),21 నవంబర్, దేవరకొండ:

విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో దేవరకొండ పట్టణంలో గోపూజ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా గోమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి, పూలమాలలు, పసుపు, కుంకుమతో అలంకరించి భక్తిపూర్వకంగా పూజించారు.ఈ సందర్భంగా గోమాత ప్రాముఖ్యతను, హిందూ ధర్మంలో గోవుకు ఉన్న విశిష్ట స్థానాన్ని వివరించారు. గోసంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.గోమాతను పూజించడం ద్వారా సమాజంలో ధార్మిక భావాలు, సేవాభావం, జీవకారుణ్యం పెంపొందుతాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ గోసంరక్షణకు తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి సురభి కృష్ణమూర్తి శర్మ, బొడ్డు ఆంజనేయులు, పగిళ్ల సాగర్, నాగరాజు, నరేష్, శివ, లక్ష్మణ్, శ్రీను, లక్ష్మి తదితరులు, భక్తులు పాల్గొన్నారు.

అమెరికాలో రోడ్డు ప్రమాదం.. మునుగోడు యువకుడి మృతి

- వారం క్రితమే ఉద్యోగం..
అంతలోనే విషాదం.. కుటుంబంలో తీరని శోకం



మునుగోడు, నవంబర్ 21: (జర్నలిస్ట్ డైరీ) :

ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన మునుగోడు యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం తీవ్ర విషాదాన్ని నింపింది. మునుగోడుకు చెందిన వీరమల్లు సాయితేజ అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. యువకుడి మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరవుతున్నారు. స్థానికుల వివరాల ప్రకారం, సాయితేజ ఈ ఏడాది ఆగస్టులో ఉన్నత చదువుల కోసం అమెరికాలోని న్యూయార్క్‌కు వెళ్లాడు. చదువుకుంటూనే భవిష్యత్తుపై ఎన్నో ఆశలు పెట్టుకున్న అతడికి వారం రోజుల క్రితమే ఉద్యోగం లభించింది. ఉద్యోగం రావడంతో కుటుంబ సభ్యులు, స్నేహితులు సంతోషంలో ఉండగా, అనూహ్యంగా జరిగిన రోడ్డు ప్రమాదం ఆ ఆనందాన్ని విషాదంగా మార్చింది.ఎన్నో ఆశలు, కలలతో విదేశాలకు వెళ్లిన యువకుడు అకాల మరణం చెందడంతో కుటుంబానికి తీరని లోటు ఏర్పడింది. చేతికందిన వయసులో కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రుల వేదన వర్ణనాతీతంగా మారింది. సాయితేజ మృతితో మునుగోడు ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

రూ.50 వేల విలువైన సోనా మసూరి బియ్యం అందజేసిన సయ్యద్ ఇబ్రహీం

షాద్‌నగర్‌లో రూ.10 భోజన కార్యక్రమాన్ని ప్రారంభించిన సయ్యద్ ఇబ్రహీం

రంగారెడ్డి జిల్లా బ్యూరో, నవంబర్ 21 (జర్నలిస్ట్ డైరీ) :

ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం కంటే గొప్ప సేవ మరొకటి లేదనే భావనతో షాద్‌నగర్ పట్టణంలో పది రూపాయలకే కడుపునిండా భోజనం అందించే కార్యక్రమానికి శనివారం శ్రీకారం చుట్టారు. షాద్ నగర్ ప్రముఖ రియల్టర్, వ్యాపారవేత్త సయ్యద్ ఇబ్రహీం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పేదలు, నిరుపేదలు, కూలీలు, చిరు వ్యాపారులు, వివిధ పనుల నిమిత్తం పట్టణానికి వచ్చే సామాన్య ప్రజలకు తక్కువ ధరలో నాణ్యమైన భోజనం అందించాలనే ఉద్దేశంతో నిర్వాహకులు ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రస్తుత రోజుల్లో పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరల నేపథ్యంలో పది రూపాయలకే భోజనం అందించడం ఎంతోమందికి ఊరటనిచ్చే విషయమని అన్నారు. ఈ కార్యక్రమానికి



తన వంతు సహకారంగా సయ్యద్ ఇబ్రహీం రూ.50 వేల విలువైన సోనా మసూరి బియ్యాన్ని నిర్వాహకులకు అందజేశారు. సమాజంలో సంపాదించిన దానిలో కొంత భాగాన్ని తిరిగి సమాజానికి ఉపయోగపడేలా ఖర్చు చేయాలనే సామాజిక బాధ్యత ప్రతి ఒక్కరిలో ఉండాలని ఆయన తన సేవా దృక్పథాన్ని చాటుకున్నారు. భారతీయ సంస్కృతిలో అన్నదానానికి విశిష్టమైన స్థానం ఉందని, ఆకలితో ఉన్న వ్యక్తికి అన్నం పెట్టడం ద్వారా కేవలం ఆకలిని తీర్చడమే కాకుండా ఆప్యాయత, మానవత్వం, సేవాభావాన్ని పంచినట్లవుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు. కులమతాలు, పేదధనిక తేడాలు లేకుండా ప్రతి ఒక్కరికీ అన్నం అందించడం అన్నదానం గొప్పతనమని తెలిపారు. సమాజంలో ఆర్థికంగా స్థోమత ఉన్నవారు ఇలాంటి సేవా కార్యక్రమాలకు ముందుకు వచ్చి తమ వంతు సహకారం అందిస్తే మరింతమంది పేదల ఆకలి తీర్చవచ్చని అభిప్రాయపడ్డారు. ఆకలితో ఎవరూ ఇబ్బంది పడకూడదనే సంకల్పంతో ప్రారంభించిన ఈ కార్యక్రమం నిరంతరాయంగా కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు బద్య, శ్రీశైలం గౌడ్, గణేష్ కుమార్, పాతూరి బ్రహ్మయ్య, క్రాంతి కుమార్, రాజేందర్, నందిగామ సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గోవుల సంరక్షణకు గోశాల.. ధార్మిక కార్యక్రమాలకు యాగశాల

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఫరూక్‌నగర్ వెంకటేశ్వర స్వామి ఆలయంలో గోశాల, యాగశాల ప్రారంభం

దాతృత్వంతో ఆలయ అభివృద్ధికి మంచనపల్లి ప్రియాంక--శివశంకర్ గౌడ్ దంపతుల చేయూత

రంగారెడ్డి జిల్లా బ్యూరో, నవంబర్ 21 (జర్నలిస్ట్ డైరీ) :

ఆధ్యాత్మికతకు ఆలయాలు నిలయాలని, భక్తి భావాన్ని పెంపొందించడంతో పాటు ధార్మిక సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో దేవాలయాలు కీలక పాత్ర పోషిస్తాయని షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని ఫరూక్‌నగర్ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన గోశాలను, దాత మాజీ ఎంపీపీ మంచనపల్లి ప్రియాంక--శివశంకర్ గౌడ్ దంపతుల ఆర్థిక సహకారంతో నిర్మించిన యాగశాలను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. ఆలయ ధర్మకర్త, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలుతో కలిసి ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముందుగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య జరిగిన ఈ కార్యక్రమం



భక్తి శ్రద్ధలతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి, ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకు దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. గోశాల ఏర్పాటు ద్వారా గోవుల సంరక్షణకు మరింత అవకాశం కలుగుతుందని, యాగశాల నిర్మాణంతో ఆలయంలో యజ్ఞయాగాదులు, ఇతర ధార్మిక కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించేందుకు వీలవుతుందని పేర్కొన్నారు. సమాజంలో దాతృత్వం, భక్తిభావం, సేవా దృక్పథం మరింత పెరగాలని ఆకాంక్షించారు. ఆలయ అభివృద్ధికి ఆర్థిక సహకారం అందించిన మంచనపల్లి ప్రియాంక--శివశంకర్ గౌడ్ దంపతులను పలువురు అభినందించారు. దైవ కార్యాలకు తమ వంతు సహకారం అందించడం సంతోషకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్ ముదిరాజ్, కౌన్సిలర్ సి. పెంటయ్య, మురళీమోహన్, అప్పి, దిలీప్, మాజీ ఎంపీపీ మంచనపల్లి శివశంకర్ గౌడ్, ముబారక్ అలీ ఖాన్, సోలిపూర్ అనిల్, ఫరూక్‌నగర్ మండల పార్టీ అధ్యక్షుడు రాయికల్ శ్రీనివాస్, సింగిల్ విండో వైస్ చైర్మన్ తుపాకుల శేఖర్, చందులాల్, తంగడపల్లి శంకర్, కత్తి చంద్రశేఖర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ ప్రతాపరెడ్డి, కానుగా అనంతయ్య, మాజీ కోఆప్షన్ సభ్యుడు ఒగ్గు కిషోర్, కాంగ్రెస్ ఎస్సీ విభాగం నియోజకవర్గ చైర్మన్ జాంగారి రవి, సీనియర్ జర్నలిస్ట్ లట్టుపల్లి మోహన్ రెడ్డి, వ్యాపారవేత్తలు పలబట్ల బాలరాజ్ గుప్తా, పరిగి సాయి ఈశ్వర్ రెడ్డి, రాచమల్ల కృష్ణయ్య, రామ్ భూపాల్, కుమార్ గౌడ్, దామోదర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, సామయ్య, మహేందర్, గుండాల అనిల్, కరుణాకర్, చటన్‌పల్లి శేఖర్, మంగ అశోక్ తదితర నాయకులు, భక్తులు, దాతలు పాల్గొన్నారు.

పిల్లల మనసు విందాం.. చైల్డ్-ఫ్రెండ్లీ సైబరాబాద్ నిర్మిద్దాం!

యునిసెఫ్, మహిళా & శిశు సంక్షేమ శాఖ సహకారంతో సీ ఎం సీ వినూత్న కార్యక్రమం

నగరాభివృద్ధిలో చిన్నారుల ఆలోచనలకు పెద్దపీట - గాంధీ

రంగారెడ్డి జిల్లా బ్యూరో, నవంబర్ 21 (జర్నలిస్ట్ డైరీ) :

నగరాభివృద్ధి ప్రణాళికల్లో చిన్నారుల అభిప్రాయాలు, ఆకాంక్షలకు భాగస్వామ్యం కల్పించే ప్రధాన లక్ష్యంతో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కీలక అడుగు వేసింది. యునిసెఫ్ మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ సహకారంతో సీఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన 'లిజనింగ్ టు చిల్డ్రన్ -- చైల్డ్-ఫ్రెండ్లీ సీ ఎం సి కార్యక్రమంలో సీఎంసీ కమిషనర్ సృజన, అదనపు కమిషనర్ సుభద్ర,మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ మోతీ , యూనిసెఫ్ ప్రతినిధులు ఖ్యాతి , ఫిలిప్, ఎఈవో వెంకటయ్య ,యునిసెఫ్ మరియు మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రతినిధులతో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతిప్రజ్వలన చేసి , ప్రసంగించిన పిమీసి చైర్మన్ ఆరెక పూడి గాంధీ.ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ నగరాభివృద్ధి ప్రణాళికల్లో చిన్నారుల అభిప్రాయాలు, ఆకాంక్షలకు భాగస్వామ్యం కల్పించే లక్ష్యంతో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కీలక అడుగు వేసింది అని, యునిసెఫ్, మహిళా మరియు



శిశు సంక్షేమ శాఖ సహకారంతో ఈ రోజు 'లిజనింగ్ టు చిల్డ్రన్ -- చైల్డ్-ఫ్రెండ్లీ సీ ఎం సి కార్యక్రమాన్ని ప్రారంభించుకోవడం చాలా సంతోషకరమైన విషయం అని, ఈ వేదుకలో 8 పాఠశాలలకు చెందిన 400 మందికి పైగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. నగర ప్రణాళిక, అభివృద్ధిలో పిల్లల గళానికి ప్రాధాన్యతనిస్తామని ప్రతినబూనుతూ 'చైల్డ్ పార్టిసిపేషన్ చార్టర్'పై అధికారులు సంతకాలు చేశారు. ఇదే వేదికపై సిబ్బంది పిల్లల కోసం ఏర్పాటు చేసిన క్రెష్ (శిశు సంరక్షణ కేంద్రం)ను ప్రారంభించడంతో పాటు ,ఇంటరాక్టివ్ సెషన్ ద్వారా విద్యార్థులు తమ పరిసరాల్లో నచ్చే అంశాలు, ఎదుర్కొంటున్న సమస్యలు మరియు తాము కోరుకుంటున్న మార్పులను అధికారులతో పంచుకున్నారు. పిల్లలకు అనుకూలమైన నగరం అందరికీ ఉత్తమమైన నగరమవుతుందనే నినాదంతో, సురక్షితమైన సైబరాబాద్ నిర్మాణానికి ఇది తొలి అడుగుగా నిలిచింది అని తెలియచేశారు.

సీఎంసీ ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమం నిర్వహించడం జరిగినది. పిల్లల గొంతుక, అవసరాలు తెలియచేయడానికి, భాగస్వామ్యులు చేయాలనే ముఖ్య ఉద్దేశం అని, మౌలిక వసతులు కల్పించడంలో పాఠశాలలకు వెళ్లే సమయంలో రోడ్డు ,ఫుట్ ఫాత్ ,ట్రాన్స్ పోర్ట్, విధి దీపాల పార్క్ వంటి విషయాలను వాటి పనితీరు, సలహాలు, సూచనలు ఇవ్వాలని పిల్లలను కోరడం జరిగినది. పిల్లల సలహాల కు ప్రథమ ప్రాధాన్యత ఇస్తామని ,స్నేహ పూర్వకమైన వాతావరణం కల్పిస్తామని, పిల్లల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని వారికి మెరుగైన జీవన ప్రమాణాలు పెంపొందించడానికి ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుంది అని, పిల్లలు పుస్తకాల పురుగు కాకుండా చదువు తో పాటు లోక జ్ఞానం నేర్చుకోవాలని, మన చుట్టూ ఉన్న పరిసరాలను గమనిస్తూ సమాజం గురించి నేర్చుకోవాలని, ప్రతి రోజు నిత్యం నేర్చుకుంటూ కొత్త దృక్పథంతో ముందుకు వెళ్ళాలి అని , పిల్లలు మంచిగా చదువుకొని భవిష్యత్తులో రాణించాలని, ఉజ్వల భవిష్యత్తు ను నిర్మించుకోవాలని, మంచి పేరు ప్రఖ్యాతులు సాధించి తల్లిదండ్రులకు, సమాజం లో మంచి పేరు సాధించుకోవాలని తెలియచేశారు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

వివాదాల్లో మిట్టకోడూర్ పంచాయతీ కార్యదర్శి.. విధులకు గైర్హాజరుపై ఎంపీడీవో షోకాజ్ మెమో!

24 గంటల్లో వివరణ కోరితే.. 48 గంటల తర్వాత తీరిగ్గా బదులుగతంలోనూ నిధుల దుర్వినియోగం ఆరోపణలు.. కలెక్టర్, డీపీవోలకు ఫిర్యాదులు

నిర్లక్ష్యపు వైఖరిపై కఠిన చర్యలు తీసుకోవాలంటున్న గ్రామస్తులు







మండల ప్రజా పరిషత్తు కార్యాలయం పరిగి వికారాబాద్ జిల్లా

మెమో

మెమో సంఖ్య.A2/118/2026 తేది.19.11.2026

విషయం :- ఉద్యోగవర్గము-మండల ప్రజా పరిషత్ పరిగి-వికారాబాద్ జిల్లా-శ్రీ యన్. బాల కిషన్ పంచాయతీ కార్యదర్శి తేది. 17.11.2026 నాడు ముందు అనుమతి పొందక విధులకు గైరజారు అయినందుకు తగు సమాజాయిషీ ఇచ్చుటకు మెమో జారీ.

సందర్భము :-మం. ప. అ. అ. మం. ప్ర. ప. పరిగి గారి వాట్సాప్ సమాచారము. తేది.16.11.2026

*****

పరిగి మండలము లో తేది.17.11.2026 నాడు శ్రీయుత గౌరవనీయులైన శాసన సభ్యులు పరిగి నియోజక వర్గము గారు. నూతనంగా మంజూరు అయినా ఆసరా పింఛన్లు, మరియు మైనారిటీ కార్పొరేషన్ ద్వారా మంజూరు అయినా కుట్టు మిషన్ పంపిణీ కార్యక్రమము కలదు. అని పై సందర్భము ద్వారా మండల పరిషత్తు అభివృద్ధి అధికారి,మండల ప్రజాపరిషత్తు పరిగి గారు తీయజేసినారు.తమరు సమాచారము విజ్ఞించిన తదుపరి ముందు అనుమతి పొందక, ఆకస్మిక సెలవు పత్రము కార్యాలయములో సమర్పించాక పొగ విధులకు గైరాజరు అయిన్నారు. శ్రీయుత గౌరవనీయులైన శాసన సభ్యుల సమావేశంలో మిట్టకోడూరు గ్రామ సర్పంచ్ గారికి, ప్రజలకు చాలా ఇబ్బంది ఏర్పడినది. మీ వలన వారికి సందానము తెలుపవలసిన పంచాయతీ కార్యదర్శి అందుబాటులో లేకపోవడముతో సర్పంచ్ గారికి , గ్రామ ప్రజలు నష్ట పోవలసి వచ్చింది.

కావున తమరు ఈ మెమో అందిన 24 గంటలలో సరియైన సమాధానముతో సమాజాయిషీ ఇచ్చుటకు ఆదేశినైనది. తేది. 17.11.2026 రోజు ముందు అనుమతి పొందక విధులకు గైరజారు అయినందుకు ఒక్కరోజు వేతనము తగిచబడును.

శ్రీ .యన్.బాలకిషన్,పం.కార్యదర్శి.GP.మిట్టకోడూర్ గారికి.

మండల పరిషత్తు అభివృద్ధి అధికారి
మండల ప్రజా పరిషత్తు పరిగి

ఇది ప్రతి

1).శ్రీయుత మండల పంచాయతి అధికారి, మం.ప్ర.ప.పరిగి గారికి, తగు సమాచారము నిమిత్తము మరియు తగు చర్య కై చర్యకై .

2).శ్రీయుత జిల్లా పంచాయతి అధికారి,వికారాబాద్ జిల్లా గారికి తగు సమాచారము నిమిత్తము మరియు తగు చర్య కై చర్యకై.

జర్నలిస్ట్ డైరీ పరిగి, నవంబర్ 21

పరిగి మండల పరిధిలోని మిట్టకోడూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎన్. బాలకిషన్ తీరు మరోసారి వివాదాస్పదమైంది. అధికారుల ఆదేశాలను బేఖాతరు చేస్తూ విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న కారణంతో పరిగి మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) ఆయనకు షోకాజ్ నోటీసు (మెమో) జారీ చేయడం మండలంలో చర్చనీయాంశంగా మారింది. అసలేం జరిగిందంటే..?ఈ నెల 17వ తేదీన పరిగి నియోజకవర్గ శాసనసభ్యుల సమక్షంలో నూతనంగా మంజూరైన ఆసరా పింఛన్లు, మైనారిటీ కార్పొరేషన్ కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి సంబంధించి ఒక రోజు ముందే (నవంబర్ 16న) మండల పంచాయతీ అధికారి ముందస్తు సమాచారం అందించారు. అయినప్పటికీ పంచాయతీ కార్యదర్శి ఎన్. బాలకిషన్ ఎటువంటి ముందస్తు అనుమతి తీసుకోకుండా, సెలవు పత్రం సమర్పించకుండా విధులకు గైర్హాజరయ్యారు. దీనివల్ల సమావేశంలో సర్పంచ్‌కు, గ్రామ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయని, ప్రజాప్రతినిధుల వద్ద సమన్వయం లోపించి గ్రామస్తులు నష్టపోవాల్సి వచ్చిందని ఎంపీడీవో తీవ్రంగా పరిగణించారు.

24 గంటల గడువు ఇచ్చినా బేఖాతరు..

విధులకు డుమ్మా కొట్టినందుకు గాను ఈ నెల 19వ తేదీన ఎంపీడీవో మెమో జారీ చేస్తూ, 24 గంటల్లోగా సరైన సమాజాయిషీ ఇవ్వాలని ఆదేశించారు. అంతేకాకుండా గైర్హాజరైనందుకు ఒక రోజు వేతనం కూడా తగ్గించబడుతుందని స్పష్టం చేశారు. అయితే, ఉన్నతాధికారులు 24 గంటల గడువు విధించినా కార్యదర్శి ఏమాత్రం లెక్కచేయకుండా, గడువు ముగిసిన తర్వాత ఈ నెల 21వ తేదీ సాయంత్రం తీరిగ్గా వివరణ రాస్తుండటం ఆయన నిర్లక్ష్యపు వైఖరికి అద్దం పడుతోంది.గత ఆరోపణల విచారణ ఉండగానే..ఇదిలా ఉండగా, సదరు పంచాయతీ కార్యదర్శిపై గతంలోనూ గ్రామ పంచాయతీ నిధుల దుర్వినియోగానికి సంబంధించి తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ విషయంపై ఇప్పటికే జిల్లా కలెక్టర్, డీపీవో (జిల్లా పంచాయతీ అధికారి), ఎంపీడీవోలకు ఫిర్యాదులు అందాయి. ఆ నిధుల ఆరోపణలపై విచారణ కొనసాగుతుండగానే, తాజాగా మరోసారి విధులకు గైర్హాజరై మెమో అందుకోవడం కలకలం రేపుతోంది.అధికారుల ఆదేశాలనే పట్టించుకోకుండా, 24 గంటల్లో ఇవ్వాల్సిన వివరణను రెండు రోజుల తర్వాత ఇస్తున్న ఇలాంటి బాధ్యతారాహిత్యమైన అధికారిపై జిల్లా కలెక్టర్, డీపీవోలు తక్షణమే స్పందించి కఠిన శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని మిట్టకోడూర్ గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

అక్రమ కట్టడాలపై గ్రామపంచాయతీ పాలకవర్గం కొరడా..!

-జర్నలిస్టు డైరీ దినపత్రికలో ప్రచురితమైన కథనానికి స్పందన..

-హ్యాపీ హోమ్స్ వెంచర్‌లో అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట

- అనుమతులు లేకుండా నిర్మిస్తే చర్యలు తప్పవని హెచ్చరిక



జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక
epaperjournalistdairy.com | Date: 21 Nov, 2026 | Page: 3

నందిగామ మండలంలో కొనసాగుతున్న భూ ఆక్రమణలు

-హ్యాపీ హోమ్స్ వెంచర్‌లో అక్రమ నిర్మాణాలు..!
-వాగు పక్కనున్న లావణి భూముల ఆక్రమణ..?
-పట్టించుకొని అధికారులు?

రంగారెడ్డి జిల్లా బ్యూరో, నవంబర్ 20 (జర్నలిస్ట్ డైరీ) :
నందిగామ మండలం, నర్సప్పగూడ గ్రామ పంచాయతీలోని హ్యాపీ హోమ్స్ వెంచర్‌లో జరుగుతున్న అక్రమ నిర్మాణాల విషయం చర్చనీయాంశంగా మారింది. వాగు పక్కనున్న లావణి భూముల్లో ఎలాంటి అనుమతి లేకుండా నిర్మాణాలు జరుగుతున్నాయని ఆరోపణలు వస్తున్నాయి.
ప్రభుత్వ భూములతో పాటు వాగులు, నీటి ప్రవాహాలను పరిరక్షించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నప్పటికీ, ఇక్కడ నిర్మాణాలు కొనసాగుతున్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వాగు పరీవాహక ప్రాంతానికి అనుకుని నిర్మాణాలు జరుగుతుండటంతో, భవిష్యత్తులో వర్షాకాలంలో నీటి ప్రవాహానికి అంతరాయం కలగవచ్చని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.సంబంధిత మండల స్థాయి అధికారులు ఈ విషయాన్ని చూసీచూడనట్లు వదిలేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ప్రభుత్వ భూముల ఆక్రమణలు, అనధికార నిర్మాణాలపై అధికారులు ఎందుకు స్పందించడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. సంబంధిత రెవెన్యూ, పంచాయతీ రాజ్ అధికారులు క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించి, భూముల సరిహద్దులను నిర్ధారించి, అక్రమ నిర్మాణాలు కనబడితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

epaperjournalistdairy.com | 21 Nov, 2026 | Page: 3 | Clip ID: C-878897
For more details, visit epaperjournalistdairy.com



రంగారెడ్డి జిల్లా బ్యూరో, నవంబర్ 21 (జర్నలిస్ట్ డైరీ) :

నందిగామ మండల పరిధిలోని నర్సప్పగూడ గ్రామ శివారులో ఉన్న హ్యాపీ హోమ్స్ వెంచర్‌లో అక్రమ నిర్మాణాలపై గ్రామపంచాయతీ పాలకవర్గం స్పందించింది. సుమారు 1,500 గజాల విస్తీర్ణంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న కట్టడాలపై చర్యలు చేపట్టింది. ఈ అక్రమ నిర్మాణాలపై జర్నలిస్టు డైరీ తెలుగు దినపత్రికలో ప్రచురితమైన వార్తా కథనానికి స్పందించిన గ్రామపంచాయతీ పాలకవర్గం క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ.. వెంచర్‌లో ఎవరికైనా ప్లాట్ ఉన్నట్లయితే తప్పనిసరిగా నాలా కన్వెన్షన్ చేసుకొని ఎల్ఆర్ఎస్ (ూ=ూ) రుసుము చెల్లించి, గ్రామపంచాయతీ నుంచి నిర్మాణ అనుమతులు పొందిన అనంతరమే నిర్మాణ పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. నిబంధనలు పాటించకుండా అక్రమంగా నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.అనంతరం గ్రామపంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో ఉపసర్పంచ్ అప్పల సిద్ధయ్య కొచ్చర్ల శ్రీనివాసులు,, ఇతర పాలకవర్గ సభ్యులు అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను తొలగించే చర్యలు చేపట్టారు. ప్రజా సమస్యలపై ప్రచురితమయ్యే వార్తలకు అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తగిన చర్యలు తీసుకుంటేనే గ్రామాల అభివృద్ధి, ప్రజా ప్రయోజనాలు కాపాడబడతాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

ట్రాక్టర్ బోల్తా.. రైతు దుర్మరణం!

కుటుంబానికి పెద్ద దిక్కును కోల్పోయిన విషాదం.. కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న కుటుంబ సభ్యులు

ఊకోండిలో విషాదఛాయలు.. కంటతడి పెట్టిస్తున్న కుటుంబ సభ్యుల ఆర్తనాదాలు



మునుగోడు, నవంబర్ 21 (జర్నలిస్ట్ డైరీ) :

వ్యవసాయమే జీవనాధారంగా బతుకుతున్న ఓ రైతు కుటుంబంలో ఒక్కసారిగా విషాదం అలుముకుంది. నిత్యం పొలం పనులతో కుటుంబాన్ని పోషిస్తూ, రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితుల్లో జీవనం సాగిస్తున్న ఆ ఇంటికి విధి తీరని శోకాన్ని మిగిల్చింది. వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన రైతు ట్రాక్టర్ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడంతో ఊకోండి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

మునుగోడు మండలం ఊకోండి గ్రామానికి చెందిన చందపాక లింగస్వామి శుక్రవారం సాయంత్రం తన సొంత వ్యవసాయ భూమిలో ట్రాక్టర్‌తో పొలం దున్నుతున్నాడు. ఈ క్రమంలో ట్రాక్టర్‌ను వెనక్కి తిప్పుతుండగా పొలం వెనుక భాగం పల్లంగా ఉండటంతో ఒక్కసారిగా ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో ట్రాక్టర్ కింద లింగస్వామి చిక్కుకుపోయి తీవ్రంగా గాయపడ్డాడు. పొట్ట భాగంలో తీవ్ర గాయాలు కావడంతో పాటు కాలు విరగడం, తలకు గాయాలు కావడంతో ఊపిరాడక అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలిసింది.

కుటుంబ సభ్యుల రోదనలు.. కదిలిన హృదయాలు!

కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉంటూ, వ్యవసాయ పనులతో కుటుంబ పోషణ సాగిస్తున్న లింగస్వామి ఆకస్మిక మరణం ఆ కుటుంబాన్ని దిక్కుతోచని స్థితిలోకి నెట్టింది. భర్త ఇక తిరిగిరాడనే చేదు నిజాన్ని జీర్ణించుకోలేక భార్య, పిల్లలు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న తీరు గ్రామస్థుల హృదయాలను కలచివేసింది. ఒకవైపు భర్తను కోల్పోయిన భార్య ఆవేదన, మరోవైపు తండ్రి ఇక లేడన్న నిజాన్ని తట్టుకోలేని పిల్లల రోదనలు అక్కడి వారిని కంటతడి పెట్టించాయి. అప్పటివరకు కుటుంబంతో కలిసి జీవనం సాగించిన వ్యక్తి ఒక్కసారిగా విగతజీవిగా మారడంతో ఆ ఇంట్లో విషాదం వర్ణనాతీతంగా మారింది.

మృతుడికి ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నట్లు సమాచారం. కుటుంబానికి అండగా నిలిచిన వ్యక్తి ఇలా అర్ధంతరంగా దూరం కావడంతో ఆ కుటుంబానికి తీరని లోటు ఏర్పడింది. జీవనాధారమైన రైతు ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబ భవిష్యత్తుపై ఆందోళన నెలకొంది.సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. మృతుడి భార్య చందపాక సుగుణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శోభన్ బాబు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

ఒక్క ప్రమాదం.. ఓ కుటుంబానికి తీరని విషాదం.. నిన్నటి వరకు కుటుంబంతో నవ్వుతూ గడిపిన వ్యక్తి నేడు విగతజీవిగా మారడం, ఆయన కోసం కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించడం చూపరులను సైతం కలచివేసింది. ఉకోండి గ్రామంలో ఈ విషాద ఘటన స్థానికులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది.

సంస్థాన్ నారాయణపురంలో ఘనంగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



మునుగోడు నవంబర్ 21 (జర్నలిస్ట్ డైరీ) :

మండల కేంద్రంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. మునుగోడు నియోజకవర్గ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి సహకారంతో మంజూరైన ఈ చెక్కులను స్థానిక సర్పంచ్ ఉప్పుల విజయలక్ష్మి లింగస్వామి లబ్ధిదారులకు అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పేద ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఊరటనిస్తుందని తెలిపారు. నియోజకవర్గ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి చొరవతో ఈ నిధులు త్వరగా మంజూరయ్యాయని ఆమె పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మొత్తం ఆరుగురు లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందింది. పెద్దగోని అరవింద్‌కు ?56,000, గుర్రం వెంకటేశానికి ?55,000, చిలువేరు సోమయ్యకు ?44,000, గోసుకొండ యాదగిరికి ?32,000, ఎడ్ల ముత్యాలుకు ?27,000, మరియు ఉప్పరిగోని కిరణ్‌కు ?23,000 చొప్పున సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. తమకు కష్టకాలంలో ఆర్థిక సహాయం అందేలా చూసిన ప్రజాప్రతినిధులకు లబ్ధిదారులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.ఈ పంపిణీ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పల్లె మల్లారెడ్డి, మాజీ సర్పంచ్ కొండ్రెడ్డి నరసింహ, నాయకులు మందుగుల బాలకృష్ణ, ఏపూరి సతీష్, వార్డు సభ్యులు సూరపల్లి వెంకటేష్, పందుల యాదగిరి గౌడ్, బల్లూరి శివ, పట్నం బాలకృష్ణ గౌడ్, సభవత్ రఘు, కట్ల వనజ భాస్కరాచారి, సింగపంగ ప్రశాంతి రమేష్, మహమ్మద్ అలీమా యూసఫ్ ఖాన్ పాల్గొన్నారు.అలాగే గ్రామ శాఖ అధ్యక్షులు బద్దుల మురళి, చేనేత సహకార సంఘం అధ్యక్షుడు చిలుకూరు శ్రీను, యువజన కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి ఉప్పుల నాగరాజు, రాత్రిపెల్లి యాదయ్య, క్రైమ్ మిర్రర్ రిపోర్టర్ ఉప్పుల వెంకటేష్, గునిగంటి రాజు గౌడ్, గ్రామ శాఖ ఉపాధ్యక్షులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కోయగురోని బావిలో ఘనంగా కొత్త చేయూత పెన్షన్ల పంపిణీ



గుర్రంపోడు నవంబర్ 21 (జర్నలిస్ట్ డైరీ) :

కోయగురోని బావిగ్రామ పంచాయతీ పరిధిలో కొత్త చేయూత పెన్షన్ల పంపిణీ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. గౌరవ సర్పంచ్ ముసుగు రాజ్యలక్ష్మి గారి అధ్యక్షతన, వారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని అర్హులైన లబ్ధిదారులకు నూతన పెన్షన్లను సర్పంచ్ చేతుల మీదుగా అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ చింతరెడ్డి ఇందిరగోవర్ధన్ రెడ్డి, గ్రామ కార్యదర్శి, వార్డు సభ్యులు ముసుగు నాగమణి సైదులు, జలగం సదా కుమార్, పోలే లక్ష్మమ్మ చిరంజీవి, దున్న ఈదయ్య, మంటిపల్లి మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ చేయూత పెన్షన్లు పేద కుటుంబాలకు ఎంతో ఆసరాగా నిలుస్తాయని ఈ సందర్భంగా ప్రతినిధులు పేర్కొన్నారు.ఈ పంపిణీ కార్యక్రమంలో పెన్షన్ లబ్ధిదారులతో పాటు గ్రామ పెద్దలు, స్థానిక యువత మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. తమకు కొత్త పెన్షన్లు అందడం పట్ల లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు.

మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన కోతులారం గ్రామ కాంగ్రెస్ నాయకులు



మునుగోడు: నవంబర్21 (జర్నలిస్ట్ డైరీ) :

మునుగోడు క్యాంపు కార్యాలయంలో గురువారం కోతులారం గ్రామ కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు మరియు ముఖ్య నాయకులు మునుగోడు శాసనసభ్యులు (ఎమ్మెల్యే) కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా గ్రామానికి సంబంధించిన పలు అంశాలపై వారితో చర్చించారు.ఈ కార్యక్రమంలో కోతులారం గ్రామ సర్పంచ్ జాల జంగయ్య యాదవ్, ఉపసర్పంచ్ గుల్లి శంకర్, గ్రామ శాఖ అధ్యక్షులు ఏపూరి యాదయ్య, అలాగే కోతులారం యూత్ కాంగ్రెస్ సభ్యులు జాల బచ్చి, ప్రసాద్ యాదవ్, వట్టి కోటి, ప్రశాంత్, పందుల లింగరాజు గౌడ్, గుడ్ జాబ్ శివ తదితరులు పాల్గొన్నారు.

బీహార్‌లో 'నితీశ్ సేతు' ప్రారంభం

దేశంలో అత్యంత పొడవైన వంతెన



పాట్నా

బీహార్‌లోని వైశాలిలో గంగా నదిపై నిర్మించిన 'నితీశ్ సేతు'ను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శనివారం ప్రారంభించారు. ఇది మన దేశంలో అత్యంత పొడవైన వంతెన. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ, జ్రేడీయూ చీఫ్ నితీశ్ కుమార్‌ను ప్రశంసించారు. ఆయన సుపరిపాలన, సంక్షేమ పథకాల పట్ల ప్రజలకు నమ్మకం ఉందన్నారు. ఈ వంతెన పాట్నాలోని కచ్చి దర్గాను వైశాలి జిల్లాలోని రాఘవ్‌పూర్, బిదుపూర్‌లను కలుపుతుంది. దీనిలోని ప్రధాన భాగం పొడవు 9.76 కి.మీ. గంగా నదికి ఇరువైపుల నిర్మించిన అప్రోచ్ రోడ్లతో కలిపి మొత్తం పొడవు 19.76 కి.మీ. దీంతో ఉత్తర, దక్షిణ బీహార్ జిల్లాల మధ్య ప్రయాణ కాలం తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు.

కల్తీ మద్యం తాగి 13 మంది మృతి

346 మందికి తీవ్ర అస్వస్థత మణిపూర్‌లో ఘటన



ఇంపాల్:

మణిపూర్‌లోని చాండెల్ జిల్లాలో కల్తీమద్యం తాగి 13 మంది చనిపోగా 346 మంది దవాఖాన పాలయ్యారు. ఈ నెల 18 నుంచి కల్తీమద్యం ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. మద్యంలో ప్రమాదకరమైన మిథనాల్ కలిసినట్టు అనుమానిస్తున్నారు. ముఖ్యమంత్రి యుమ్నామ్ ఖేమ్‌చంద్ సింగ్ బాధితులను పరామర్శించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బిష్ణుపూర్, సేనాపతి, కక్చింగ్, తౌబాల్ జిల్లాల్లో స్థానికంగా తయారయ్యే మద్యం లేదా ఆధారాలు తెలియని మద్యాన్ని తాగొద్దన్నారు.

చైనా విడిభాగాలతో దేశ భద్రతకు ముప్పు!



న్యూఢిల్లీ

భారత రక్షణ రంగంలో ఐదేండ్లలో కొనుగోలు చేసిన డ్రోన్లు, వాటి విడి భాగాలలో చైనాకు చెందినవే ఎక్కువ ఉండటంపై డ్రోన్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డీఎఫ్ఐ) తీవ్ర ఆందోళన వ్యక్తంచేసింది. 2021 మార్చి నుంచి 2026 నవంబర్ 19 వరకు ప్రభుత్వ ఈ-మార్కెట్‌ప్లేస్ ద్వారా సైన్యం, భద్రతా బలగాలు, ఇతర ప్రభుత్వ సంస్థలు చైనా డ్రోన్లు, వాటి విడిభాగాలను పేర్కొంటూ ఏకంగా 689 టెండర్లు జారీ చేసినట్టు డీఎఫ్ఐ వెల్లడించింది. వీటిలో 580 టెండర్లు (84 శాతం) ఒక్క భారత సైన్యానివే కావడం గమనార్హం. 2026లో ఇప్పటివరకు గుర్తించిన 355 టెండర్లలో 328 టెండర్లు కూడా సైన్యానికి సంబంధించినవే.

బీజేపీలో చేరిన క్రికెటర్ యజ్వేంద్ర చాహల్



న్యూఢిల్లీ

భారత యువ క్రికెటర్ యుజ్వేంద్ర చాహల్ రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చారు. శనివారం అధికారికంగా బీజేపీలో చేరారు. చాహల్‌ను బీజేపీ జాతీయ ఓబీసీ మోర్చా కార్యవర్గంలో ప్రత్యేక ఆహ్వానితుడిగా పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ నియమించారు. బీజేపీలో చేరడానికి ముందు ఓబీసీ మోర్చా అధ్యక్షుడు అమర్‌పాల్ మౌర్యతో చాహల్ ప్రత్యేకంగా భేటీ అయ్యాడు. చాహల్ రాకతో యువతలో ముఖ్యంగా ఓబీసీలో బీజేపీకి బలం చేకూరుతుందని పార్టీ వర్గాలు తెలిపాయి. చాహల్ ఇండియా తరఫున అనేక మ్యాచ్‌ల్లో ఆడాడు

నీట్ పేపర్ లీక్ కేసులో అభియోగాలు నమోదు

14 మంది నిందితులు విచారణ ఎదుర్కోవాల్సిందే

25 నుంచి ప్రత్యేక కోర్టులో రోజువారీ విచారణ



న్యూఢిల్లీ, నవంబర్ 21

నీట్-యూజీ2026 పేపర్ లీక్ కేసులో 14 మంది నిందితులు అందరిపై ఢిల్లీ ఫాస్ట్-ట్రాక్ కోర్టు శనివారం అధికారికంగా అభియోగాలను నమోదు చేసింది. నిందితులలో ఎన్‌టీఏ సబ్జెక్ట్ నిపుణులు కూడా ఉన్నారు. నిందితులు అందరూ శనివారం రౌస్ అవెన్యూ కోర్టులో ప్రత్యేక న్యాయమూర్తి అజయ్ గుప్తా ఎదుట హాజరయ్యారు. తాము నిర్దోషులమని, విచారణను ఎదుర్కొనడానికి తాము సిద్ధంగా ఉన్నామని వారు చెప్పారు. కుట్ర, మోసం, నమ్మకద్రోహం, అవినీతితో సహా పలు అభియోగాలను వారిపై కోర్టు నమోదు చేసింది. ఈనెల 25 నుంచి రోజువారీ విచారణ జరుగుతుంది.

అదానీ డిఫెన్స్ క్షిపణుల పరీక్ష విజయవంతం

భూతల, గగనతల లక్ష్యాలను ఛేదించే సత్తా



న్యూఢిల్లీ

అదానీ గ్రూప్‌నకు చెందిన అదానీ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ శుక్రవారం నిర్వహించిన బఖీరా ఏటీ1 ట్యాంక్ విధ్వంసక గైడెడ్ క్షిపణుల పరీక్ష విజయవంతమైంది. ఈ కంపెనీ శనివారం ఇచ్చిన పోస్ట్‌లో తెలిపిన వివరాల ప్రకారం, రాజస్థాన్‌లోని పోఖ్రాన్ ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్‌లో ఈ పరీక్షలు రాత్రి , పగలు జరిగాయి. ఇవి వాహనంపై తీసుకెళ్లగలిగే క్షిపణులు. భూతలం నుంచి ప్రయోగించే యాంటీ ట్యాంక్ మిసైల్ సామర్థ్యం దాదాపు 4 కి.మీ. ఉంటుంది, కాగా, బఖీరా ఏటీ1 సామర్థ్యం 8 కి.మీ. వరకు ఉన్నది. ఈ వ్యవస్థ గగనతల లక్ష్యాలను కూడా ఛేదించగలదు.

రాజస్థాన్‌లో బీజేపీకి ఘోర పరాభవం

-స్థానిక ఎన్నికల్లో అధికార పార్టీకి భారీ ఎదురుదెబ్బ

-పంచాయతీ, పరిషత్ ఎన్నికల్లో 70% సీట్లలో పరాజయం

-సీఎం, మంత్రుల నియోజక వర్గాల్లో సైతం తప్పని ఓటమి

-మంత్రుల సొంత కుటుంబ సభ్యులకూ తప్పని ఓటమి



న్యూఢిల్లీ, నవంబర్ 21:

స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీ గెలుపొందడం సర్వసాధారణం. కానీ రాజస్థాన్‌లో సీన్ రివర్స్ అయింది. అక్కడ అధికారంలో ఉన్న బీజేపీకి భారీ ఎదురుదెబ్బ తగిలింది. రాష్ట్రంలో ఎన్నికలు జరిగిన మొత్తం 37 జిల్లాల్లో కేవలం ఆరు జిల్లాల్లో మాత్రమే తన ఆధిపత్యాన్ని ప్రదర్శించగలిగింది. మిగిలిన 31 జిల్లాల్లో బీజేపీ చిత్తుగా ఓడిపోయింది. ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ సొంత జిల్లాల్లో సైతం అధికార పార్టీకి ఘోర పరాభవం ఎదురైంది. రాజస్థాన్‌లో శుక్రవారం జిల్లా పరిషత్, పంచాయతీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీలు దాదాపు 70 శాతం పంచాయతీ సీట్లను, రెండింతల జిల్లా పరిషత్ సీట్లను గెలుచుకున్నారు.

సీఎం భజన్‌లాల్‌శర్మ ప్రాతినిధ్యం వహిస్తున్న సంగవేర్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని సంగవేర్ పంచాయతీ సమితిలో మొత్తం 15 స్థానాలకు గాను 8 సీట్లను సహనుమాన్ బెనివాల్ నేతృత్వంలోని రాష్ట్రీయ లోక్‌తాంత్రిక్ పార్టీ గెలుచుకుంది. భరత్‌పూర్ జిల్లా పరిషత్‌లోని మొత్తం 31 స్థానాలకు గాను బీజేపీ కేవలం 9 స్థానాలను గెలుచుకుంది. మరో రెండేండ్లలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న రాజస్థాన్‌లో గ్రామీణ ఓటర్లు అధికారంలో ఉన్న బీజేపీని చావుదెబ్బ తీశారు. ఆ పార్టీ కీలక నాయకుల ప్రభావం ఉన్న ప్రాంతాల్లో సైతం ఓటమిని చవిచూడటంతో వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి పార్టీని తిరిగి బలోపేతం చేసుకోవలసిన బాధ్యత అధికారపక్షంపై పడింది. రాష్ట్రంలోని మొత్తం 41 జిల్లాల్లో 37 జిల్లా పరిషత్‌లకు మాత్రమే ఫలితాలు వచ్చాయి. ఇందులో కేవలం ఆరు చోట్ల మాత్రమే బీజేపీ మెజారిటీని దక్కించుకుంది. మిగిలిన నాలుగు జిల్లాల్లో ఓట్ల లెక్కింపు వచ్చే నెలలో జరుగనున్నది.

రాష్ట్ర మంత్రి జబర్‌సింగ్ ఖ్రా భార్య, ఇద్దరు కుమారులతోసహా నలుగురు కుటుంబ సభ్యులు శ్రీమాదోపూర్ పంచాయతీ సమితి ఎన్నికల్లో ఘోర ఓటమిని చవిచూశారు. క్యాబినెట్ మంత్రులు రాజవర్ధన్ రాథోడ్, జోరారామ్ కుమావత్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీజేపీ ఓటమి చెందింది. ఆర్ఎల్‌పీకి బలమైన పట్టున్న నాగౌర్‌లో ఆ పార్టీ తన సత్తాను చాటుకుంది. ఈ ఫలితాలు బీజేపీకి తీవ్ర ఆందోళనను కలిగిస్తున్నాయి. ఈ ఫలితాలు అధికార పార్టీకి చెందిన స్థానిక నాయకత్వ పాలనాతీరుపై ప్రజల తీర్పును స్పష్టంగా సూచిస్తున్నాయి.

బీజేపీ దిగ్గజాలకు ఎదురుదెబ్బ

'పెట్టుబడుల' లీక్‌పై రాజకీయ ప్రకంపనలు

-బిద్దుబాటు చర్యల్లో రెండు రాష్ట్రాలు

-తొలిగించింది ఇద్దరినేనని, మరో13 మంది స్వచ్ఛందంగా వెళ్లారని ప్రకటన



చెన్నై/అమరావతి : పెట్టుబడులకు సంబంధించి ఆంధ్రప్రదేశ్, తమిళనాడు మధ్య నెలకొన్న వివాదం రెండు రాష్ట్రాల్లో రాజకీయ ప్రకంపనలు రేపుతున్నది. తమిళనాడుకు రావాల్సిన పెట్టుబడులను ఏపీ దకించుకొంటున్నదని, ఇందుకోసం గైడెన్స్‌లో పనిచేసిన ఉద్యోగులు గూఢచర్యం చేశారంటూ ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ ఆరోపణలతో 15 మంది ఉద్యోగులను తొలిగించినట్టు మీడియా సంస్థలు కథనాలు ప్రచురించాయి. 15మంది గైడెన్స్ సంస్థను వీడటం నిజమే అయినా.. అందులో 13 మంది స్వచ్ఛందంగా రాజీనామా చేశారని, ఇద్దరిని మాత్రమే తొలిగించినట్టు తేలింది. 10 మందికి జాబ్ ఆఫర్ ఇవ్వగా, ముగ్గురు మాత్రమే చేరారని ఏపీ తరఫున వాదనలు వినిపిస్తున్నాయి.

జూనియర్ వికటన్ కథనంతో అజ్యం

తమిళనాడు పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో 1992లో గైడెన్స్ అనే సంస్థ ఏర్పాటైంది. పరిశ్రమల ఏర్పాటుకు అనువైన ప్రాంతాల గుర్తింపు వంటి బాధ్యతలను ఈ సంస్థ నిర్వహిస్తుంది. విశాఖపట్నంలో నిర్వహించిన పెట్టుబడుల సదస్సు తాజా వివాదానికి వేదికగా మారింది. రూ.10 లక్షల కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలు వచ్చాయని ప్రభుత్వం ప్రకటించింది. గైడెన్స్‌లో గతంలో పనిచేసిన కొందరు ఉద్యోగులు ఈ సదస్సు నిర్వహణలో భాగస్వాములయ్యారని ఈ నెల 18న తమిళ పత్రిక జూనియర్ వికటన్‌లో ప్రచురితమైన కథనం ఈ వివాదానికి ఆజ్యంపోసింది. గైడెన్స్‌లో కీలక స్థానాల్లో పనిచేసిన ఉద్యోగులు ఇప్పుడు ఏపీతో కలిసి పనిచేస్తున్నారని పేర్కొన్నది. పరిశ్రమల శాఖ మాజీ మంత్రి రాజాకు సన్నిహితులని, టీవీకే ప్రభుత్వం వారిని తొలిగించిందని వెల్లడించింది.

బస్సు ప్రయాణం ప్రాణసంకటమా?

ఐదేండ్లలో 606 అగ్ని ప్రమాదాలు

భద్రతా లోపాలు సరిదిద్దేదెన్నడు?



న్యూఢిల్లీ:

దేశంలో బస్సు ప్రయాణం రోజురోజుకూ ప్రమాదకరంగా మారుతున్నదా? వరుస అగ్నిప్రమాదాలు ప్రయాణికుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. 2021 జనవరి నుంచి 2026 జూన్ వరకు దేశవ్యాప్తంగా మొత్తం 606 బస్సు అగ్ని ప్రమాదాలు నమోదయ్యాయి. ఈ ఘటనల్లో 303 మంది ప్రాణాలు కోల్పోగా, 991 మంది గాయపడ్డారు. ఒక్క 2026 తొలి ఆరు నెలల్లోనే 133 బస్సుల్లో అగ్ని ప్రమాదాలు చోటుచేసుకోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతున్నది.మహారాష్ట్రలో అత్యధికంగా 82, తమిళనాడు, యూపీలో 44 చొప్పున జరిగాయి. రాజస్థాన్ లో 55 మంది చనిపోయారు.ప్రైవేటు బస్సుల్లో జరిగిన 367 ప్రమాదాల్లో 276 మంది మరణించారు. ఇంజిన్, విద్యుత్తు వ్యవస్థల్లో లోపాలు, టైర్లు, బ్రేకుల వైఫల్యాలు ప్రమాదాలకు కారణం. స్లీపర్ బస్సుల్లో అత్యవసర ద్వారాలను తొలగించడం ప్రాణాలకు ముప్పుగా మారుతున్నది.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

బిజినెస్

మళ్లీ తగ్గిన బంగారం ధరలు

-పసిడి కొనుగోలుదారులకు స్వల్ప ఊరట
-22 క్యారెట్ల పది గ్రాములపై రూ.450 తగ్గుదల
-రూ.1,14,650కు చేరిన పది గ్రాముల ధర
-24 క్యారెట్ల బంగారంపై రూ.490 కోత
-రూ.1,25,080 వద్ద కొనసాగుతున్న పసిడి
-కిలో వెండి ధర రూ.1.75 లక్షలు
-తెలుగు రాష్ట్రాల్లో నగరాలవారీగా స్వల్ప వ్యత్యాసాలు
-కొనుగోళ్లకు ముందు స్థానిక ధరలు తెలుసుకోవాలంటున్న వ్యాపారులు



హైదరాబాద్: బంగారం ధరలు మరోసారి తగ్గాయి. శనివారం దేశీయ బులియన్ మార్కెట్‌లో పసిడి ధరలు స్వల్పంగా దిగివచ్చాయి. గత కొద్ది రోజులుగా ధరల్లో చోటుచేసుకుంటున్న మార్పులు కొనుగోలుదారుల్లో ఆసక్తి రేకెత్తిస్తున్నాయి. పెళ్లిళ్లు, శుభకార్యాల సీజన్ నేపథ్యంలో బంగారం కొనుగోలు చేయాలనుకునేవారికి తాజా తగ్గుదల కొంత ఊరటనిస్తోంది. శనివారం 22 క్యారెట్లకు చెందిన పది గ్రాముల బంగారం ధరపై రూ.450 తగ్గింది. దీంతో ఈ ధర రూ.1,14,650కు చేరింది. అదేవిధంగా 24 క్యారెట్ల స్వచ్ఛమైన పది గ్రాముల బంగారం ధర రూ.490 మేర దిగివచ్చి రూ.1,25,080 వద్ద నిలిచింది. రెండు రకాల బంగారంలోనూ ధరలు తగ్గడంతో కొనుగోలుదారులు తాజా ధరలను పరిశీలిస్తున్నారు.

వెండి ధరలో మార్పు లేదు

మరోవైపు వెండి ధర కిలోకు రూ.1,75,000గా కొనసాగుతోంది. బంగారం ధరలు తగ్గినప్పటికీ వెండి ధరలో మాత్రం పెద్దగా మార్పు కనిపించలేదు. బులియన్ మార్కెట్‌లో అంతర్జాతీయ పరిణామాలు, పెట్టుబడిదారుల కొనుగోళ్లు, డిమాండ్ ఆధారంగా విలువైన లోహాల ధరల్లో హెచ్చుతగ్గులు చోటుచేసుకుంటుంటాయి.

నగరాలవారీగా ధరల్లో తేడాలు

తెలుగు రాష్ట్రాల్లోని హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి తదితర నగరాల్లో బంగారం, వెండి ధరల్లో స్వల్ప వ్యత్యాసాలు ఉండొచ్చు. స్థానిక పన్నులు, ఇతర ఖర్చుల కారణంగా ఒక ప్రాంతానికి మరో ప్రాంతానికి ధరలు మారుతుంటాయి. అందువల్ల ఆభరణాలు కొనుగోలు చేసేవారు దుకాణాల్లో తాజా ధరలను తెలుసుకోవాలని వ్యాపారులు సూచిస్తున్నారు. బంగారంపై వర్తించే మూడు శాతం వస్తు సేవల పన్ను అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. ఆభరణాల తయారీ ఖర్చులు కూడా విడిగా ఉంటాయి.

ఎస్‌బీఐకి భారీ జరిమానా!

-రుణం తీర్చినా ఆస్తి పత్రాలు అప్పగించని బ్యాంకు
-1997లో సేల్‌డీడ్ తనఖా పెట్టి గృహ రుణం
-2019లోనే రుణం పూర్తిగా చెల్లించిన బాధితుడు
-పత్రాలు కనిపించడం లేదంటూ బ్యాంకు సమాధానం
-వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించిన గుల్వీర్ సింగ్ చౌహాన్
-వెంటనే సేల్‌డీడ్ అందించాలని కమిషన్ ఆదేశం
-పత్రాలు అప్పగించే వరకు రోజుకు రూ.5 వేల పరిహారం
-రుణం చెల్లించిన తేదీ నుంచే పరిహారం లెక్కించాలని స్పష్టీకరణ



లక్నో: గృహ రుణం పూర్తిగా చెల్లించినప్పటికీ ఆస్తికి సంబంధించిన అసలు పత్రాలను తిరిగి అప్పగించడంలో నిర్లక్ష్యం వహించిన భారతీయ స్టేట్ బ్యాంకు (ఎస్‌బీఐ)కు వినియోగదారుల కమిషన్ భారీ జరిమానా విధించింది. రుణగ్రహీతకు చెందిన సేల్‌డీడ్‌ను వెంటనే తిరిగి అందించాలని, అప్పటివరకు జరిగిన జాప్యానికి రోజుకు రూ.5 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని ఆదేశించింది. రుణం చెల్లించినప్పటి నుంచి పత్రాలు తిరిగి ఇచ్చే వరకు ఈ పరిహారం వర్తిస్తుందని స్పష్టం చేసింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన గుల్వీర్ సింగ్ చౌహాన్ 1997లో తన ఆస్తికి సంబంధించిన సేల్‌డీడ్‌ను ఎస్‌బీఐలో డిపాజిట్ చేసి గృహ రుణం తీసుకున్నారు. రుణానికి భద్రతగా ఆస్తి పత్రాలను బ్యాంకుకు సమర్పించారు. నిర్ణీత కాలంలో వాయిదాలు చెల్లిస్తూ వచ్చిన ఆయన 2019లో రుణాన్ని పూర్తిగా తీర్చేశారు. సాధారణంగా రుణం పూర్తిగా చెల్లించిన అనంతరం బ్యాంకు తన వద్ద ఉన్న తనఖా పత్రాలను రుణగ్రహీతకు తిరిగి అప్పగించాల్సి ఉంటుంది. అయితే, రుణం చెల్లించిన తర్వాత తన సేల్‌డీడ్‌ను తిరిగి ఇవ్వాలని చౌహాన్ బ్యాంకును కోరారు. పత్రాలు కనిపించడం లేదని బ్యాంకు అధికారులు సమాధానమిచ్చినట్లు తెలుస్తోంది. పలుమార్లు కోరినా పత్రాలు అందకపోవడంతో ఆయనకు ఇబ్బందులు ఎదురయ్యాయి. ఆస్తికి సంబంధించిన అసలు దస్తావేజులు చేతిలో లేకపోవడంతో వాటిపై హక్కుల నిర్ధారణ, భవిష్యత్తులో ఆస్తి లావాదేవీలు నిర్వహించడం వంటి అంశాల్లో సమస్యలు తలెత్తే పరిస్థితి ఏర్పడింది. దీంతో బాధితుడు వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. తన రుణాన్ని 2019లోనే పూర్తిగా చెల్లించినప్పటికీ, బ్యాంకు తన ఆస్తి పత్రాలను తిరిగి ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తోందని ఫిర్యాదు చేశారు. ఇరుపక్షాల వాదనలు పరిశీలించిన కమిషన్ బ్యాంకు తీరును తప్పుబట్టింది. రుణం పూర్తిగా చెల్లించిన తర్వాత కూడా పత్రాలను తిరిగి ఇవ్వకపోవడం వినియోగదారుడికి తీవ్ర అసౌకర్యం కలిగించడమేనని పేర్కొంది.

రెండేళ్ల కనిష్ఠానికి బిట్‌కాయిన్

-క్రిప్టో మార్కెట్‌లో భారీ పతనం
-55,533 డాలర్లకు పడిపోయిన బిట్‌కాయిన్
-ఏడాదిలో 70 వేల డాలర్లకు పైగా తగ్గుదల



ప్రపంచంలోనే అతిపెద్ద క్రిప్టోకరెన్సీ బిట్‌కాయిన్ విలువ భారీగా పతనమైంది. శుక్రవారం అమెరికా మార్కెట్లో 6 శాతం, శనివారం ఆసియా మార్కెట్లో మరో 5.7 శాతం తగ్గి 55,533 డాలర్లకు చేరింది. 2024 సెప్టెంబర్ తర్వాత ఇదే కనిష్ఠ స్థాయి. గతేడాది అక్టోబర్‌లో 1,26,000 డాలర్ల గరిష్ఠాన్ని తాకిన బిట్‌కాయిన్ ఏడాదిలోనే 70 వేల డాలర్లకు పైగా పడిపోయింది. మొత్తం క్రిప్టో మార్కెట్ విలువ 7.58 శాతం తగ్గి 1.95 ట్రిలియన్ డాలర్లకు చేరింది. ప్రపంచ మార్కెట్లలో అనిశ్చితి, పెరుగుతున్న రుణ వ్యయాలు, బైనాన్స్‌పై హ్యాకింగ్ ప్రభావం, అమెరికా రాజకీయ పరిణామాలతో పెట్టుబడిదారులు క్రిప్టో పెట్టుబడులపై వెనుకడుగు వేస్తున్నారని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

స్పోర్ట్స్

వరుసగా మూడో కప్పు కొడతాం. చరిత్ర సృష్టిస్తాం: ఆర్సీబీ కోచ్ ఆండీ ఫ్లవర్

-వరుసగా మూడో ఐపీఎల్ టైటిల్ గెలుస్తామని ఆర్సీబీ కోచ్ ఆండీ ఫ్లవర్ ధీమా
-డిసెంబర్ 16న జరిగే మినీ వేలానికి ముందు 20 మంది ఆటగాళ్లను అట్టిపెట్టుకున్న యాజమాన్యం
-గత రెండు సీజన్లలో రాణించిన కోర్ టీమ్‌ను కొనసాగించడంపై పూర్తి సంతృప్తి
-రూ. 14.15 కోట్ల పర్స్‌తో ఐదుగురు ఆటగాళ్లను కొనుగోలు చేసేందుకు సిద్ధం
-వరుసగా మూడు టైటిళ్లు గెలిచి చరిత్ర సృష్టించడమే లక్ష్యమన్న ఆండీ ఫ్లవర్



ఐపీఎల్ 2027 సీజన్‌లో వరుసగా మూడోసారి టైటిల్ గెలిచి చరిత్ర సృష్టించడంపై డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) ధీమాగా ఉంది. డిసెంబర్ 16న జరగనున్న మినీ వేలానికి ముందు జట్టు అట్టిపెట్టుకున్న ఆటగాళ్లపై హెడ్ కోచ్ ఆండీ ఫ్లవర్ పూర్తి సంతృప్తి వ్యక్తం చేశాడు. తమ కోర్ టీమ్‌తో హ్యాట్రిక్ టైటిల్ సాధిస్తామని విశ్వాసం వెలిబుచ్చాడు. మినీ వేలానికి ముందు ఆర్సీబీ తమ టైటిల్ విన్నింగ్ జట్టులోని కీలక సభ్యులతో సహా మొత్తం 20 మంది ఆటగాళ్లను రిటైన్ చేసుకుంది. రూ. 14.15 కోట్ల పర్స్‌తో వేలంలోకి అడుగుపెట్టనుంది. జట్టులో ఇంకా ఐదు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. తక్కువ పర్స్‌తో వేలానికి వెళుతున్నప్పటికీ, తమ వద్ద పటిష్ఠమైన జట్టు ఉండటం సానుకూలాంశమని ఫ్లవర్ అన్నాడు. 'జియోస్టార్'తో మాట్లాడుతూ ఫ్లవర్ తన అభిప్రాయాలను పంచుకున్నాడు. "గత రెండు సీజన్లు మాకు అద్భుతంగా గడిచాయి. ఈ సైకిల్‌లో మూడో ఏడాదిలోకి అడుగుపెడుతున్నాం. మా ప్రస్తుత జట్టుతో ఎంతో నమ్మకంగా ఉన్నాము. వేలంలో జట్టును మరింత మెరుగుపరచడం మా బాధ్యత. అయితే, ఇతర జట్లతో పోలిస్తే మా వద్ద ఖర్చు చేసేందుకు తక్కువ డబ్బు ఉంది. అయినా మేం దాని గురించి ఆందోళన చెందడం లేదు. ఎందుకంటే గత రెండేళ్లుగా అద్భుతంగా రాణించిన మా కోర్ టీమ్‌ను అట్టిపెట్టుకున్నాం. ఈ కలయిక 2027లో కూడా మాకు బాగా పనిచేస్తుందని ఆశిస్తున్నాం. వరుసగా మూడు టైటిళ్లు గెలిచి చరిత్ర సృష్టించేందుకు ఇది మాకు చాలా ముఖ్యమైన సీజన్" అని ఫ్లవర్ వివరించాడు.

ఆర్సీబీ రిటైన్ చేసుకున్న ఆటగాళ్లలో విరాట్ కోహ్లీ, భువనేశ్వర్ కుమార్, దేవదత్ పడిక్కల్, జోష్ హేజిల్‌వుడ్, కృనాల్ పాండ్య, ఫిల్ సాల్ట్, టిమ్ డేవిడ్, వెంకటేశ్ అయ్యర్ వంటి కీలక ఆటగాళ్లు ఉన్నారు. అదే సమయంలో జాకబ్ బెథెల్, రిచర్డ్ గ్లీసన్‌తో పాటు మరో నలుగురిని జట్టు నుంచి విడుదల చేసింది. గోవాలో జరిగే వేలంలో వ్యూహాత్మకంగా కొద్దిమంది ఆటగాళ్లను ఎంపిక చేసుకొని, జట్టును మరింత బలోపేతం చేయాలని ఆర్సీబీ యాజమాన్యం భావిస్తోంది.

సచిన్ టెండూల్కర్ కూతురు సారా పెళ్లిపై మళ్లీ పుకార్లు..

-సారా టెండూల్కర్, నటుడు రాజ్‌వీర్ డియోల్ పెళ్లిపై సోషల్ మీడియాలో ప్రచారం
-2027లో వీరి వివాహం జరగవచ్చంటూ ఎక్స్, రెడ్డిట్ వేదికల్లో వైరల్ అవుతున్న పోస్టులు
-ఈ ప్రచారంపై ఎలాంటి ప్రకటన చేయని టెండూల్కర్, డియోల్ కుటుంబాలు



క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ కుమార్తె సారా టెండూల్కర్ వివాహం గురించి సోషల్ మీడియాలో సరికొత్త ప్రచారం మొదలైంది. బాలీవుడ్ ప్రముఖ నటుడు సన్నీ డియోల్ కుమారుడు, యువ నటుడు రాజ్‌వీర్ డియోల్‌తో సారా వివాహం జరగనుందంటూ నెట్టింట వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' (ట్విట్టర్), 'రెడ్డిట్'లలో వైరల్ అయిన కొన్ని పోస్టుల ఆధారంగా ఈ ఊహాగానాలు పుట్టుకొచ్చాయి. వీరిద్దరికీ త్వరలోనే సంబంధం కుదరనుందని, 2027లో పెళ్లి జరిగే అవకాశం ఉందని ఆ పోస్టుల్లో పేర్కొన్నారు. ఈ వార్తలు కాస్తా ఇంటర్నెట్‌లో విపరీతంగా వ్యాపించడంతో పలు ఎంటర్‌టైన్‌మెంట్ వెబ్‌సైట్లలో కథనాలు వెలువడ్డాయి. అయితే, ఈ ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని స్పష్టమవుతోంది. సారా టెండూల్కర్, రాజ్‌వీర్ డియోల్ వివాహం గురించి వస్తున్న వార్తలపై అటు టెండూల్కర్ కుటుంబం కానీ, ఇటు డియోల్ కుటుంబం కానీ ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. ఇరు కుటుంబాల నుంచి ఎలాంటి ధ్రువీకరణ లేకపోవడంతో ఇవన్నీ పూర్తిగా నిరాధారమైన పుకార్లుగానే తెలుస్తోంది. గతంలోనూ సారా టెండూల్కర్ వ్యక్తిగత జీవితంపై పలుమార్లు ఇలాంటి వదంతులు వచ్చాయి. టీమిండియా యువ క్రికెటర్ శుభ్‌మన్ గిల్‌తో ఆమె పేరును ముడిపెడుతూ వార్తలు వచ్చినా, వాటిపై కూడా ఎప్పుడూ అధికారిక స్పష్టత రాలేదు. ప్రస్తుతం రాజ్‌వీర్ డియోల్‌తో వినిపిస్తున్న పెళ్లి వార్తలు కూడా కేవలం సోషల్ మీడియాకే పరిమితమైన ఊహాగానాలు మాత్రమేనని తెలుస్తోంది.

ముగిసిన మూడోరోజు ఆట.. త్రుటిలో శతకం చేజార్చుకున్న కెప్టెన్ గిల్..

-భారీ ఆధిక్యం దిశగా భారత్
-వెల్లింగ్టన్ టెస్టులో రాహుల్ అద్భుత సెంచరీ
-మూడో రోజు ఆట ముగిసేసరికి భారత్ 486/4
-శతకానికి రెండు పరుగుల దూరంలో ఔటైన గిల్
-ప్రస్తుతం 118 పరుగుల ఆధిక్యంలో టీమిండియా



వెల్లింగ్టన్ వేదికగా న్యూజిలాండ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో భారత బ్యాటర్లు పూర్తి ఆధిపత్యం ప్రదర్శించారు. ఓపెనర్ కేఎల్ రాహుల్ (136) అద్భుతమైన సెంచరీతో కదం తొక్కడంతో మూడో రోజు ఆట ముగిసే సమయానికి టీమిండియా 4 వికెట్ల నష్టానికి 486 పరుగుల భారీ స్కోరు చేసింది. దీంతో తొలి ఇన్నింగ్స్‌లో 118 పరుగుల కీలక ఆధిక్యం సంపాదించింది. భారత ఇన్నింగ్స్‌కు రాహుల్ సెంచరీ వెన్నెముకగా నిలిచింది. 9 ఫోర్లు, 2 సిక్సర్లతో రాహుల్ తన టెస్ట్ కెరీర్‌లో 13వ శతకాన్ని నమోదు చేశాడు. మరో బ్యాటర్ దేవదత్ పడిక్కల్ (80)తో కలిసి రెండో వికెట్‌కు 165 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. అయితే కైల్ జేమీసన్ బౌలింగ్‌లో పడిక్కల్ ఔటయ్యాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (98) కూడా అద్భుతంగా ఆడాడు. సెంచరీ ఖాయమనుకున్న తరుణంలో, మూడో రోజు ఆటలో చివరి ఓవర్‌లో జాకబ్ డఫీ బౌలింగ్‌లో క్లీన్ బౌల్డ్ అయి నిరాశగా వెనుదిరిగాడు. ప్రస్తుతం క్రీజులో దూకుడుగా ఆడిన రిషబ్ పంత్ (55 నాటౌట్), నైట్ వాచ్‌మన్‌గా వచ్చిన అన్షుల్ కంబోజ్ (0) ఉన్నారు. అంతకుముందు ఆతిథ్య కివీస్ తన తొలి ఇన్నింగ్స్‌లో 368 రన్స్‌కు ఆలౌట్ అయిన విషయం తెలిసిందే.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

తెలుగు ప్రేక్షకుల ముందుకు 'ఫూలే'..

నవంబర్ 27న గ్రాండ్ రిలీజ్!



సామాజిక సంస్కరణల చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన మహనీయులు జ్యోతిరావ్ ఫూలే, సావిత్రిబాయి ఫూలే జీవిత పోరాటం ఆధారంగా తెరకెక్కిన చిత్రం 'ఫూలే'. సమాజంలో నెలకొన్న కులవివక్ష, అసమానతలు, మహిళలపై వివక్షకు వ్యతిరేకంగా పోరాడుతూ విద్య, సమానత్వం, సామాజిక న్యాయం కోసం తమ జీవితాలను అంకితం చేసిన ఫూలే దంపతుల స్ఫూర్తిదాయక ప్రయాణాన్ని ఈ సినిమాలో ఆవిష్కరించారు. ప్రముఖ దర్శకుడు అనంత్ మహదేవన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి సుపదా క్రియేషన్స్ బ్యానర్‌పై డా. పాన్నం రవిచంద్ర నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. తెలుగు డబ్బింగ్ పనులు పూర్తి చేసుకున్న ఈ చిత్రం నవంబర్ 27న థియేటర్లలో తెలుగు ప్రేక్షకుల ముందుకు రానుంది.తెలంగాణ ప్రభుత్వం కూడా ఈ చిత్రాన్ని ప్రత్యేకంగా వీక్షించింది. ఇక సినిమా వీక్షించిన అనంతరం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. కులవివక్ష నిర్మూలన, మహిళా విద్య కోసం ఫూలే దంపతులు చేసిన పోరాటం నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. వారి సామాజిక సేవ, జీవిత ఆశయాలు నేటి సమాజానికి అత్యంత అవసరమైన సందేశాన్ని అందిస్తాయని అభిప్రాయపడ్డారు. 'ఫూలే' కేవలం ఒక సినిమా మాత్రమే కాదని, సమాజంలో మార్పు కోసం పోరాడిన ఇద్దరు మహనీయుల జీవితాలను, వారు ఎదుర్కొన్న అడ్డంకులను కళ్లకు కట్టే ఒక చారిత్రాత్మక కథనమని చిత్ర బృందం పేర్కొంది. నేటి యువత, విద్యార్థులు ఫూలే దంపతుల జీవితం గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉందని, సమానత్వం, విద్య, మానవత్వం వంటి విలువలను గుర్తుచేసే ఈ చిత్రాన్ని ప్రతి ఒక్కరూ థియేటర్లలో వీక్షించి ఆదరించాలని నిర్మాత డా. పాన్నం రవిచంద్ర, చిత్ర బృందం విజ్ఞప్తి చేశారు.

కీర్తి సురేశ్ 'సత్యవాన్ సావిత్రి'కి ఊహించని ఓపెనింగ్స్.. తొలి రోజే షాక్!



నటి కీర్తి సురేశ్ వరుసగా విభిన్న కథా చిత్రాలతో ప్రేక్షకులను అలరించే ప్రయత్నం చేస్తున్నారు. ఇటీవల 'డొరోతీ' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఆమె.. ఇప్పుడు 'సత్యవాన్ సావిత్రి' అనే కోర్టు డ్రామాతో థియేటర్లలో సందడి చేస్తున్నారు. ప్రముఖ దర్శకుడు మిస్కిన్ కీలక పాత్రలో నటించడంతో ఈ సినిమాపై కొంత ఆసక్తి ఏర్పడింది. అయితే విడుదలకు ముందు పెద్దగా ప్రచారం లేకపోవడంతో ఈ చిత్రానికి బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్పందన లభించలేదు. 'సత్యవాన్ సావిత్రి' సినిమా తక్కువ అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ముఖ్యంగా తెలుగు వెర్షన్‌కు సంబంధించి ప్రేక్షకుల్లో పెద్దగా అవగాహన కనిపించలేదు. సినిమా విడుదలైన విషయం కూడా చాలామందికి తెలియని పరిస్థితి నెలకొంది.మరోవైపు తమిళంలోనూ ఈ చిత్రానికి చెప్పుకోదగ్గ ఓపెనింగ్స్ రాలేదు. కీర్తి సురేశ్ వంటి గుర్తింపు ఉన్న నటి ప్రధాన పాత్రలో నటించినప్పటికీ, ఆ క్రేజ్ తొలి రోజు వసూళ్లలో కనిపించకపోవడం నిరాశ కలిగిస్తోంది.టికెట్ బుకింగ్ వేదిక బుక్‌మైషోలో ఈ సినిమా తొలి రోజు కేవలం 5 వేల టికెట్లకు కొద్దిగా ఎక్కువ మాత్రమే అమ్ముడయ్యాయి. స్టార్ నటీనటులు ఉన్న చిత్రానికి ఈ స్థాయి స్పందన రావడం బాక్సాఫీస్ వద్ద నిరాశాజనక పరిణామమే. ముఖ్యంగా తమిళ వెర్షన్ నుంచైనా మంచి ఓపెనింగ్ వస్తుందని ఆశించిన చిత్ర బృందానికి ఈ ఫలితం షాక్ ఇచ్చినట్లయింది. ప్రస్తుతం 'సత్యవాన్ సావిత్రి'కి ప్రేక్షకుల నుంచి ఆశించిన ఆదరణ కనిపించడం లేదు. అయితే వారాంతంలో సినిమా పరిస్థితి మారుతుందా? ప్రేక్షకుల స్పందనతో థియేటర్లకు వచ్చే వారి సంఖ్య పెరుగుతుందా? అన్నది ఆసక్తికరంగా మారింది. మంచి కథ, నటన ఉన్నప్పటికీ ప్రచారం లోపిస్తే సినిమాలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతాయో ఈ చిత్రం పరిస్థితి మరోసారి గుర్తు చేస్తోంది. డ్రమ్‌స్టిక్స్ ప్రొడక్షన్స్, జీ స్టూడియోస్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించాయి. నూతన దర్శకుడు ప్రవీణ్ ఎస్. విజయ్ తెరకెక్కించారు. చారుకేశ్, బాల సరవణన్, శిల్పా మంజునాథ్, మధుసూదనన్, ఆర్. సుందరరాజన్, బ్రిగిడా, మాలా పార్వతి, ఏ. వెంకటేశ్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. సామ్ సీఎస్ సంగీతం అందించారు.



ప్రశాంత్ వర్మకు షాక్?.

వైష్ణవ్ తేజ్‌తో ప్రైమ్‌షో 'హను-మాన్ 2' అనౌన్స్‌మెంట్!



టాలీవుడ్‌లో అందరినీ షాక్‌కి గురిచేస్తూ 'హను-మాన్ 2' సినిమాపై ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ అధికారిక ప్రకటన చేసింది. మెగా హీరో పంజా వైష్ణవ్ తేజ్ హీరోగా, విభిన్న కథలతో ఆకట్టుకునే వివి ఆనంద్ దర్శకత్వంలో ఈ భారీ పాన్-ఇండియా సినిమా తెరకెక్కనుంది. ఈ చిత్రానికి 'హను-మాన్ 2 -- ది రైజ్ ఆఫ్ వానరాస్' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేశారు. గతంలో 'ఎక్కడికి పోతావు చిన్నవాడా', 'ఊరు పేరు భైరవకోన' వంటి ఫాంటసీ, థ్రిల్లర్ సినిమాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్న వివి ఆనంద్, ఈసారి సరికొత్త పౌరాణిక ఫాంటసీ కథతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు.తాజాగా విడుదల చేసిన ఈ సినిమా అనౌన్స్‌మెంట్ పోస్టర్ సోషల్ మీడియాలో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఇందులో కాషాయ వస్త్రం కట్టుకున్న వైష్ణవ్ తేజ్ కండలు తిరిగిన శరీరంతో వెనుకకు తిరిగి నిలబడి ఉండగా, ఒక భారీ హనుమంతుడి తోక ఆయనను చుట్టుకుని ఆకాశంలోకి ఎత్తుతున్నట్లుగా పోస్టర్‌ను ఎంతో ఆకట్టుకునేలా రూపొందించారు. మొదటి భాగం 'హను-మాన్' సినిమాను నిర్మించిన ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై కె. నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి ఈ సీక్వెల్‌ను కూడా భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. తెలుగుతో పాటు హిందీ, తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో పాన్-ఇండియా స్థాయిలో ఈ సినిమా విడుదల కానుంది. మరోవైపు, ఈ ప్రకటన ఇప్పుడు తెలుగు సినీ పరిశ్రమలో పెద్ద చర్చకు దారితీసింది. మొదటి భాగం 'హను-మాన్'కు దర్శకత్వం వహించిన ప్రశాంత్ వర్మ, ప్రస్తుతం మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణంలో రిషబ్ శెట్టి హీరోగా 'జై హనుమాన్' సినిమాను తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. అయితే 'హను-మాన్' కథ, సీక్వెల్ హక్కులు తమ నిర్మాణ సంస్థకే చెందుతాయని భావిస్తున్న ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్, ఇప్పుడు వైష్ణవ్ తేజ్ -- వివి ఆనంద్ కాంబినేషన్‌లో నేరుగా 'హను-మాన్ 2' ప్రకటించడం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. త్వరలోనే ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానుండగా, ఇందులో నటించే ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను చిత్ర బృందం త్వరలో వెల్లడించనుంది.

ప్రశ్నలతో విసిగించాను!

సూపర్‌స్టార్ రజనీకాంత్ 'ధర్మన్' సినిమాలో కీలకపాత్ర పోషిస్తున్నది అందాల తార రాశీఖన్నా. ఆ సినిమా లొకేషన్‌లో రజనీతో తన అనుభవాలను ఆసక్తికరంగా వెల్లడించారామె 'నా కెరీర్‌లో చాలామంది స్టార్లతో పనిచేశాను. ఇప్పుడు 'ధర్మన్'లో సూపర్‌స్టార్‌తో పనిచేస్తున్నాను. నిజానికి స్టార్‌డమ్ ఎంజాయ్ చేస్తున్న వారి ప్రవర్తన విభిన్నంగా ఉంటుంది. కానీ కొన్ని దశాబ్దాలుగా సూపర్‌స్టార్‌డమ్‌ని ఎంజాయ్ చేస్తున్న రజనీసార్ ఆటిట్యూడ్ వారందరికీ పూర్తి భిన్నం. నిజం చెబుతున్నా..లొకేషన్‌లో రజనీసార్ నాకు ఫ్రెండ్ అయిపోయారు. సెట్‌లో ఆయన పక్కన ఉంటే చిన్నపిల్లలా మారిపోయేదాన్ని. ఆయనతో ఎంత చనువు ఏర్పడిందంటే.. ఒక్కోసారి ప్రశ్నలతో విసిగించేదాన్ని. ఆయన మాత్రం నవ్వుతూ ఓపిగ్గా సమాధానాలు చెప్పేవారు. అంత సూపర్‌స్టార్‌తో మాట్లాడాలంటే ఎవరికైనా బెరుకే. నేను మాత్రం ఆయన పక్కన కూర్చొని చాలా విషయాలు మాట్లాడేదాన్ని. ఏ మాత్రం గర్వం లేకుండా నిరాడంబరంగా ఉండే ఆయన్ను చూస్తుంటే చాలా ముచ్చటేసేది' అంటూ చెప్పుకొచ్చింది రాశీఖన్నా.

'జనవరి 12 విడుదల' నుంచి ఫస్ట్ సింగిల్ 'దివికి దివికి' విడుదల!



అగ్ర కథానాయకులు విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్ ప్రధాన పాత్రల్లో డైరెక్టర్ అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న తాజా చిత్రం 'జనవరి 12 విడుదల'. సంక్రాంతి కానుకగా జనవరి 12న ఈ చిత్రం విడుదల కాబోతుండగా.. ఈ సినిమా ప్రమోషన్లను చిత్రబృందం ఘనంగా ప్రారంభించింది. ఇందులో భాగంగా సినిమాలోని తొలి పాట 'దివికి దివికి' సంబంధించిన సాంగ్ ప్రోమోను తాజాగా విడుదల చేసింది. సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ ఈ చిత్రానికి స్వరాలు సమకూరుస్తుండగా.. మధుప్రియ, హరిప్రియ కలిసి పాడారు. అనంత్ శ్రీరామ్ లిరిక్స్ అందించాడు.వెంకటేష్, కళ్యాణ్ రామ్ కలిసి నటిస్తున్న తొలి చిత్రం కావడంతో 'జనవరి 12 విడుదల'పై ఆరంభం నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. వీరిద్దరి సరసన కీర్తి సురేష్, కృతి శెట్టి కథానాయికలుగా నటిస్తున్నారు. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాడు.

Printed, Published and Owned by SITARALLA SRIRAMULU and Printed at M/s SRI DIVYA PRINTERS, Plot No. 33 & 34, 2nd Floor, Vasthu Colony, LB Nagar, Ranga Reddy, Telangana - 500074 and Published at H.No. 10-1-101/10. Bhagya Nagar Colony, Lingojiguda, Saroornagar, Ranga Reddy, Telangana - 500035. EDITOR: SITARALLA SRIRAMULU , RNI. No. TELTEL/2015/62524. Cell: 9966443465